


VARTHAA SAKSHAMU

RNI.Title Code: APTEL/25/A5153

# వార్త సాక్ష్యం

తెలుగు దిన పత్రిక

Editor : SAGINALA RAVI KUMAR

హైదరాబాద్, విజయవాడ | సంపుటి : 01 | సంచిక : 35 | ఆదివారం 5 జూలై 2026 | పేజీలు : 8 | వెల : 2/-

## మీరు నన్ను ఆపాలనుకుంటే.. చంపాల్సిందే.. తిరుగుబాటుదారులకు మమత సవాల్..

జులై 4 వార్త సాక్ష్యం

రాజకీయంగా తనను అడ్డుకోవడం ఎవరి వల్లా సాధ్యంకాదని, తనను ఆపాలంటే తన ప్రాణాలు తీయాల్సిందేనని పశ్చిమ బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి, తృణమూల్ కాంగ్రెస్ పార్టీ అధినేత్రి మమతా బెనర్జీ తేల్చి చెప్పారు. పార్టీని వీడి తిరుగుబాటు చేస్తున్న నాయకులను ఆమె ద్రోహులుగా అభివర్ణించారు. పార్టీ అధికారిక గుర్తు తన వైపు ఉన్న నమ్మకస్థుల వద్దే ఉంటుందని చెప్పారు.



## ఖమేనీకి కన్నీటి వీడ్కోలు.. పక్కనే 14 నెలల చిన్నారి శవపేటిక..

జులై 4 వార్త సాక్ష్యం

అమెరికా దాడుల్లో మృతిచెందిన ఇరాన్ సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనీ అంత్యక్రియలు శనివారం అధికారికంగా ప్రారంభమయ్యాయి. అమెరికా-ఇజ్రాయెల్ సంయుక్త దాడుల్లో ఈ ఏడాది ఫిబ్రవరి 28న మరణించిన 86 ఏళ్ల ఖమేనీకి చివరి వీడ్కోలు పలికేందుకు వేలాదిగా ప్రజలు టెహ్రాన్ నగరానికి తరలివచ్చారు. దేశ జెండాతో కప్పిన ఖమేనీ



## తెలంగాణలో పోలీస్ కొలువుల జాతర.. 7 వేల పోస్టుల భర్తీకి ప్రభుత్వం ఆమోదం




2

- హోంశాఖ పరిధిలోని పోలీస్, జైళ్లు, ఫైర్, ఎస్‌పీఎఫ్ విభాగాల్లో నియామకాలు
- ఇప్పటికే 5 వేల పోస్టులకు జీవోలు జారీ.. మరో 2 వేలకు త్వరలో ఉత్తర్వులు
- ఆర్థిక శాఖ అనుమతులు రావడంతో నోటిఫికేషన్‌కు సిద్ధమైన టీఎస్‌ఎల్‌పీఆర్‌బీ
- రాష్ట్రం ఏర్పడ్డాక ఇది నాలుగో అతిపెద్ద పోలీస్ రిక్రూట్‌మెంట్

## శ్రీశైలం నియోజకవర్గం లో వైసీపీలో కలవరం..

# టిడిపి వైపు నేతల క్యూ...!

2

- శ్రీశైలం నియోజకవర్గంలో గతితప్పిన వైసీపి నాయకత్వ లోపమా
- టిడిపి అభివృద్ధి నినాదమా చేరికలతో జోష్...!
- తెలుగుదేశం, పార్టీ అంతర్మథనంలో వైసీపీ
- స్థానిక సంస్థల ఎన్నికల వేళ దిక్కుతోచని స్థితిలో వైసిపి
- ఇప్పటికే ఒక ఎంపీపీ చేరిక.. నేడో, రేపో ముఖ్య నాయకుల చేరికలకు ముహూర్తం ఖరారు
- పునర్విభజన ఆలోచనతో పట్టించుకొని వైసీపీ మాజీ ప్రజాప్రతినిధి

## పార్టీ పేరు మార్చాలంటూ ఈసీ ఆదేశం.. ఘాటుగా స్పందించిన కవిత

జులై 4 వార్త సాక్ష్యం

సొంత పార్టీ స్థాపనతో తెలంగాణ రాజకీయాల్లో సరికొత్త ప్రస్థానాన్ని ప్రారంభించాలనుకున్న మాజీ ఎమ్మెల్యే కల్వకుంట్ల కవితకు కేంద్ర ఎన్నికల సంఘం ఊహించని బిగ్ షాక్ ఇచ్చింది. 'తెలంగాణ రక్షణ సేన' పేరుతో పార్టీ రిజిస్ట్రేషన్ కోసం ఆమె చేసుకున్న దరఖాస్తుపై ఏకంగా వెయ్యికి పైగా అభ్యంతరాలు వచ్చాయని సీఈసీ వెల్లడించింది. పార్టీ పేరు మార్చాల్సిందేనంటూ ఆదేశాలు జారీ చేసింది.




2

## పీక్ అవర్స్‌లో మెట్రో ప్రయాణం మరింత కష్టం.. పెరగనున్న నిరీక్షణ సమయం



2

- హైదరాబాద్ మెట్రో ప్రయాణికులకు పెరగనున్న నిరీక్షణ సమయం
- కొత్తగా 60 కోచ్‌ల కొనుగోలు ప్రక్రియలో రెండేళ్ల జాప్యం
- కేంద్రం నుంచి రాష్ట్రానికి బదిలీ ప్రక్రియ ఆలస్యం కావడమే కారణం
- పీక్ అవర్స్‌లో తీవ్ర రద్దీతో కొనసాగుతున్న ప్రయాణికుల ఇబ్బందులు
- వాల్యుయేషన్ పూర్తయ్యాకే కోచ్‌ల కొనుగోలుకు మార్గం సుగమం

## బెయిల్ ఇస్తే సాక్షులను ప్రభావితం చేస్తాడు: బండి భగీరథ్ కేసులో హైకోర్టుకు పోలీసులు

- పోక్సో కేసులో కేంద్రమంత్రి బండి సంజయ్ కుమారుడికి బెయిల్ ఇవ్వొద్దన్న పోలీసులు
- హైకోర్టులో కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేసిన దర్యాప్తు అధికారులు
- మైనర్‌ను లొంగదీసుకుని లైంగిక దాడికి పాల్పడినట్లు ఆరోపణలు



2

VARTHAA SAKSHAMU RNI Title Code: APTEL/25/A5153
వార్త సాక్ష్యం తెలుగు దిన పత్రిక
Editor : SAGINALA RAVI KUMAR



## రాజకీయాల్లో 20 ఏళ్లు.. భావోద్వేగ పోస్ట్ చేసిన సీఎం రేవంత్ రెడ్డి

జులై 4 వార్త సాక్ష్యం

ప్రజా జీవితంలోకి అడుగుపెట్టి 20 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఆయన శనివారం సోషల్ మీడియా వేదికగా ఒక భావోద్వేగభరితమైన పోస్ట్ చేశారు. తన సుదీర్ఘ ప్రయాణాన్ని గుర్తుచేసుకుంటూ, భవిష్యత్తు కార్యాచరణను ప్రజలతో పంచుకున్నారు. రెండు దశాబ్దాల క్రితం మిడ్జిల్‌లో 'రేవంత్ రెడ్డి'గా మొదలైన తన ప్రస్థానం, నేడు ప్రజల ఆదరాభిమానాలతో 'రేవంతన్న'గా వారి గుండెల్లో నిలిచిపోయిందని ఆయన పేర్కొన్నారు. ఈ అద్భుత ప్రయాణం తన జీవితంలో ఒక ప్రత్యేక అధ్యాయమని అభివర్ణించారు. ఈ 20 ఏళ్ల కాలంలో ప్రతి సంఘర్షణలో, ప్రజల కోసం తాను చేసిన ప్రతి పోరాటంలో అండగా నిలిచిన ఆత్మీయులకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు మరియు కార్యకర్తలకు ఆయన హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఇదే స్ఫూర్తితో భవిష్యత్తులో 'తెలంగాణ పునర్నిర్మాణ శ్రామికుడి'గా, ప్రజల ఆకాంక్షలను నెరవేర్చే సేవకుడిగా పనిచేస్తానని హామీ ఇచ్చారు. అన్నింటికీ మించి 'రేవంతన్న'గా ప్రజల హృదయాల్లో తన స్థానాన్ని మరింత సుస్థిరం చేసుకుంటానని మాట ఇచ్చారు.

## మీరు నన్ను ఆపాలనుకుంటే.. చంపాల్సిందే.. తిరుగుబాటుదారులకు మమత సవాల్..

పార్టీని వీడి తిరుగుబాటు చేస్తున్న నాయకులను ఆమె ద్రోహులుగా అభివర్ణించారు. పార్టీ అధికారిక గుర్తు తన వైపు ఉన్న నమ్మకస్థుల వద్దే ఉంటుందని చెప్పారు. శనివారం మమత మాట్లాడుతూ.. 'పార్టీ సింబల్ ఎక్కడికీ పోదు. మీరు నన్ను ఆపాలని అనుకుంటే.. నన్ను చంపాల్సిందే. చంద్రిమా భట్టాచార్య ఈ రోజు రాజీనామా చేశారు. ఆమె ఇక్కడి పరిస్థితులపై ముందుగానే నాకు సమాచారం ఇచ్చారు. రాజీనామా చేస్తానని కూడా చెప్పారు. ఆమె కుమారుడు యాంటీ తృణమూల్ గుంపులో చేరాడన్న కారణంతోనే చంద్రిమా భట్టాచార్య రాజీనామా చేశారు. అది ఆమె ఇష్టం. ఆమెకు ఆ స్వేచ్ఛ ఉంది. కానీ, నేను మాత్రం వాళ్లతో చేతులు కలపను. నేను బీజేపీ ముందు తలవంచను. బెదిరింపులకు నా పార్టీ లొంగదు' అని తేల్చి చెప్పారు.

**పార్టీ ఆఫీస్ స్వాధీనంపై మమత ఆగ్రహం..**

తృణమూల్ కాంగ్రెస్ పార్టీ బహిష్కృత ఎమ్మెల్యే రితబ్రత బెనర్జీ నేతృత్వంలోని తిరుగుబాటు వర్గం కోల్‌కతాలోని పార్టీ ప్రధాన కార్యాలయాన్ని శుక్రవారం స్వాధీనం చేసుకుంది. ఈ విషయంపై మమతా బెనర్జీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆమె మాట్లాడుతూ.. 'నిన్న తృణమూల్ కాంగ్రెస్ కార్యాలయానికి వెళ్లి దానికి తాళం వేసిన వారికి నేను ఒకటే చెబుతున్నాను. మేము ఆ కార్యాలయాన్ని అద్దెకు తీసుకున్నాము. అది అక్టోబర్ 2027 వరకు మాకు లీజుకు ఇవ్వబడింది.

## బెయిల్ ఇస్తే సాక్షులను ప్రభావితం చేస్తాడు: బండి భగీరథ్ కేసులో హైకోర్టుకు పోలీసులు

బండి సాయి భగీరథ్‌కు బెయిల్ మంజూరు చేయవద్దని తెలంగాణ పోలీసులు హైకోర్టును కోరారు. మైనర్ బాలికపై లైంగిక దాడికి పాల్పడినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న పోక్సో కేసులో ఈ మేరకు పోలీసులు కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేశారు. నిందితుడికి బెయిల్ మంజూరు చేస్తే సాక్షులను ప్రభావితం చేసే అవకాశం ఉందని పోలీసులు తమ అఫిడవిట్‌లో ఆందోళన వ్యక్తం చేశారు. పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ కె. విజయవర్ధన్ జులై 3న దాఖలు చేసిన కౌంటర్‌లో పలు కీలక వివరాలను వెల్లడించారు. 17 ఏళ్ల బాలికతో పరిచయం పెంచుకున్న భగీరథ్, ఆమెను లోబర్చుకుని 2025 నుంచి పలుమార్లు లైంగిక దాడికి పాల్పడినట్లు పేర్కొన్నారు. హైదరాబాద్‌లోని శ్రీరామ్ గార్డెన్స్, నానక్‌రామ్‌గూడలోని గోల్ఫ్ ఎడ్జ్ అపార్ట్‌మెంట్స్‌లో ఈ ఘటనలు జరిగినట్లు తెలిపారు. ఈ కేసులో భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్), పోక్సో చట్టంలోని వివిధ సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్లు వివరించారు. ప్రస్తుతం జ్యుడీషియల్ కస్టడీలో ఉన్న భగీరథ్, తాను నిర్దోషినని, రాజకీయ కుట్రలో భాగంగానే తనను ఈ కేసులో ఇరికించారని ఆరోపిస్తూ రెగ్యులర్ బెయిల్ కోసం హైకోర్టును ఆశ్రయించారు.

## మెల్‌బోర్న్ పర్యటనకు ముందు ప్రధాని మోదీకి డెత్ వార్నింగ్

జులై 4 వార్త సాక్ష్యం

భారత ప్రధాని నరేంద్ర మోదీ త్వరలో ఆస్ట్రేలియా పర్యటనకు వెళ్లనున్న నేపథ్యంలో సోషల్ మీడియా వేదికగా బెదిరింపులు వచ్చాయి. మెల్‌బోర్న్ మీట్స్ మోదీ పేరిట జరగనున్న ఈ కార్యక్రమంలో ఆయన పాల్గొననున్నారు. ఈ కార్యక్రమాల ప్రమోషన్ కోసం ఉద్దేశించిన ఒక ఫేస్ బుక్ పోస్టుకు కామెంట్ రూపంలో నిందితులు ఈ బెదిరింపులకు దిగారు. అబూ ముస్తాఫా పేరిట ఉన్న అకౌంట్ నుంచి నిందితులు ఈ పోస్టు పెట్టారు. 'స్టేడియం రూఫ్‌టాప్‌ను మూసేస్తే మంచిది. ఈ కార్యక్రమానికి మోదీ రావడమంటే మృత్యువు కోసం వస్తున్నట్టే' అని కామెంట్ చేశారు. ఈ ఘటనపై ఆస్ట్రేలియా ఫెడరల్ పోలీసులు ఇప్పటికే రంగంలోకి దిగారు. ఏ ఐపీ అడ్రస్ నుంచి ఈ పోస్టు వచ్చిందో గుర్తించారు. అయితే, ఈ ఉదంతంలో ఎవరినైనా అరెస్టు చేశారా? లేదా? అనేది ఇంకా తెలియాల్సి ఉంది. ఈ ఘటనను తీవ్రంగా పరగణిస్తున్నామని ఆస్ట్రేలియా అధికారులు తెలిపారు. పలు దర్యాప్తు సంస్థలు ఈ ఘటనపై వివిధ కోణాల్లో దర్యాప్తు చేస్తున్నాయి. ఇక ప్రధాని మోదీ జులై 8-10 మధ్య ఆస్ట్రేలియాలో పర్యటించనున్నారు. జులై 9న మెల్‌బోర్న్ మీట్స్ మోదీ ఈవెంట్‌లో పాల్గొంటారు. ఈ పర్యటన సందర్భంగా ఆస్ట్రేలియా-ఇండియా వార్షిక సమావేశంలో కూడా మోదీ పాల్గొంటారు.

# శ్రీశైలం నియోజకవర్గంలో వైసీపీలో కలవరం.. టిడిపి వైపు నేతల క్యూ...!

ఆత్మకూరు జులై 4 వార్త సాక్ష్యం

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అతి త్వరలోనే రాష్ట్ర వ్యాప్తంగా స్థానిక సంస్థ ఎన్నికలకు కూటమి ప్రభుత్వం కసరత్తు మొదలు పెట్టింది ఈ నేపథ్యంలోని ప్రతిపక్ష పార్టీల నేతలకు దడలు పుట్టించే విధంగా రాష్ట్ర వ్యాప్తంగా అన్ని అసెంబ్లీల లో అధికార పార్టీ ఎమ్మెల్యేలు, ఎంపీలు, రాష్ట్ర మంత్రులు, తమ ఓటు బ్యాంక్ క్యాడర్ ను కాపాడుకుంటూ నియోజకవర్గ ప్రజలకు కూటమి ప్రభుత్వంలో అభివృద్ధి ప్రజల సంక్షేమం కోసం పాటుపడుతున్న నేపథ్యంలో వైసిపి పార్టీలో కీలక నేతలకు కలవరం పెడుతుంది ఈ నేపథ్యంలోనే నంద్యాల జిల్లాలోని శ్రీశైలం నియోజకవర్గం లో వైసిపి పార్టీకి చెందిన ముఖ్య కీలకమైన నేతలు పార్టీ మారే అవకాశాలు మెండుగా కనిపిస్తున్నాయి అభివృద్ధి వైపు చూసి వైసిపి కీలక నాయకులు టిడిపి పార్టీ వైపు నేతలు క్యూ కడుతున్నారంటే రాజకీయాలలో ఎంత మార్పు వచ్చిందో దీన్నిబట్టి అందరికి అర్థమవుతుంది శ్రీశైలం నియోజకవర్గం లో గతి తప్పిన వైసిపి నాయకత్వలోపాల.. లేక టిడిపి అభివృద్ధి నినాదమా అనే విషయం తెలియాల్సి ఉంది నేడు రేపో, వైసిపి పార్టీ వీడి, టిడిపి పార్టీ తీర్థం పుచ్చుకునేందుకు వైసిపి కీలక నేతలు సిద్ధమైనట్లు సమాచారం మరోవైపు శ్రీశైలం నియోజకవర్గం లో రాజకీయాల పరిణామాల దృశ్య ఆ ప్రజాప్రతినిధికి నమ్మి కీలక నేతగా పనిచేసిన నాయకులే టిడిపి పార్టీలోకి రావడంతో ఆ పార్టీలో నాయకుల్లో కార్యకర్తల్లో మరింత జోష్ పెరిగింది నియోజకవర్గంలో తాజా రాజకీయాల్లో అత్యధికంగా ఓ సామాజిక వర్గానికి చెందిన పెద్ద కుటుంబాలే వైసీపీ పార్టీ వీడి టిడిపి పార్టీలో చేరుతున్నట్లు మరో సమాచారం మాజీ వార్డు కౌన్సిలర్లు, పెద్ద ఎత్తున పార్టీలో చేరేందుకు రంగం సిద్ధం చేసుకున్నారు వైసీపీ పార్టీలో నమ్ముకున్న నేతలకు, కార్యకర్తలకు, సీనియర్ నాయకులకు పార్టీలో విలువ లేకపోవడంతోని తెలుగుదేశం పార్టీ వైపు మొగ్గ చూపుతున్నట్లు విశ్వసనీయవర్గాల సమాచారం ప్రస్తుతం ఆత్మకూరు పురపాలక సంఘంలో జరిగే తాజా రాజకీయాలలో వైసిపి పార్టీ వీడి టిడిపి పార్టీ తీర్థం పుచ్చుకునేందుకు నాయకులు కార్యకర్తలు క్యూ కట్టడంతో గత మూడు రోజుల నుంచి పట్టణంలో నియోజకవర్గం రాజకీయాలపై హాట్ టాపిక్ గా మారిందని చెప్పవచ్చు ఇప్పటికే వైసిపి పార్టీని వీడిన మాజీ ఎంపీపీ తెలుగుదేశం తీర్థం తో పార్టీ కండువా వేసి స్థానిక ఎమ్మెల్యే పార్టీలోకి ఆహ్వానం పలికిన విషయం అందరికీ తెలిసిందే అయితే నేడో, రేపో, జరిగే తాజా రాజకీయాలపై వైసిపి నేతల్లో ఉత్కంఠ గా నెలకొంది ఒకవైపు టిడిపి పార్టీలో జోష్ నింపుతున్న నాయకుల క్యాడర్ పై మరింత బలోపేతం కావడం ఖాయం పునర్వి భజన ఆలోచనతో వైసిపి నేతలని కార్యకర్తలని పట్టించకపోవడంతోనే మాజీ ప్రజాప్రతినిధికి శ్రీశైలం నియోజకవర్గం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన ముఖ్య నేతలు భారీ షాక్ ఇస్తున్నట్లు సమాచారం

# తెలంగాణలో పోలీస్ కొలువుల జాతర.. 7 వేల పోస్టుల భర్తీకి ప్రభుత్వం ఆమోదం

తెలంగాణలోని నిరుద్యోగ యువతకు రాష్ట్ర ప్రభుత్వం తీపి కబురు అందించింది. పోలీస్ కొలువు సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్న వేలాది మంది అభ్యర్థుల నిరీక్షణకు తెరదించుతూ, హోంశాఖ పరిధిలోని వివిధ విభాగాలలో భారీగా ఉద్యోగాల భర్తీకి పచ్చజెండా ఊపింది. పోలీస్, జైళ్లు, అగ్నిమాపక శాఖ, స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ (ఎస్‌పీఎఫ్) విభాగాలలో ఖాళీగా ఉన్న దాదాపు 7,000 పోస్టులను భర్తీ చేసేందుకు ప్రభుత్వం అధికారికంగా ఆమోదముద్ర వేసింది. ఈ నిర్ణయంతో పోలీస్ ఉద్యోగాల కోసం సన్నద్ధమవుతున్న అభ్యర్థుల్లో కొత్త ఉత్సాహం నెలకొంది. ఈ నియామక ప్రక్రియను వేగవంతం చేసే దిశగా, ప్రభుత్వం ఇప్పటికే 5,000 పోస్టుల భర్తీకి సంబంధించిన జీవోలను జారీ చేసింది. మిగిలిన 2,000 పోస్టులకు సంబంధించిన ఉత్తర్వులు కూడా మరో రెండు రోజుల్లో వెలువడనున్నాయని అధికార వర్గాలు తెలిపాయి. ఆర్థిక శాఖ నుంచి అవసరమైన అనుమతులు కూడా లభించడంతో, తెలంగాణ రాష్ట్ర స్థాయి పోలీస్ నియామక మండలి (టీఎస్ఎల్‌పీఆర్‌బీ) సమగ్ర నోటిఫికేషన్ జారీ చేయడానికి రంగం సిద్ధం చేసుకుంటోంది. ఒకటి రెండు రోజుల్లోనే అభ్యర్థుల అర్హతలు, సిలబస్, పరీక్షల నిర్వహణ తేదీలతో కూడిన పూర్తి వివరాలను బోర్డు తన అధికారిక వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచనుంది. గత కొంతకాలంగా రాష్ట్రంలో కొత్త పోలీస్ నోటిఫికేషన్లు విడుదల చేయాలని, వయోపరిమితి సడలించాలని నిరుద్యోగ అభ్యర్థులు పెద్ద ఎత్తున ఆందోళనలు, విజ్ఞప్తులు చేస్తున్న విషయం తెలిసిందే. వారి డిమాండ్లకు సానుకూలంగా స్పందించిన ప్రభుత్వం, ఈ నియామక ప్రక్రియకు శ్రీకారం చుట్టింది. ఎలాంటి న్యాయపరమైన చిక్కులు రాకుండా, పారదర్శకంగా రిక్రూట్‌మెంట్ పూర్తి చేసేందుకు పోలీస్ బోర్డు అధికారులు విధివిధానాలను ఖరారు చేస్తున్నారు. తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించిన తర్వాత హోంశాఖలో భారీ స్థాయిలో నియామకాలు చేపట్టడం ఇది నాలుగోసారి కావడం గమనార్హం. స్వరాష్ట్రంలో మొట్టమొదటిసారిగా 2015 చివరి రోజున 9,281 పోస్టుల భర్తీకి తొలి నోటిఫికేషన్ విడుదలైంది. ఆ తర్వాత, 2018లో రికార్డు స్థాయిలో 1,217 ఎస్సై, 16,285 కానిస్టేబుల్ పోస్టులతో రెండో విడత భర్తీ ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేశారు. అనంతరం మూడో విడతగా 2022లో 554 ఎస్సై పోస్టులు, 15,644 కానిస్టేబుల్ పోస్టులకు నోటిఫికేషన్ ఇచ్చి నియామకాలు చేపట్టారు. ఇప్పుడు నాలుగో విడతలో భాగంగా మరో 7,000 ఉద్యోగాలకు ప్రభుత్వం పచ్చజెండా ఊపడంతో, పోలీస్ శాఖలో స్థిరపడాలని కలలు కంటున్న వేలాది మంది నిరుద్యోగుల ఆశలు మళ్లీ చిగురించాయి. త్వరలో వెలువడనున్న అధికారిక నోటిఫికేషన్ కోసం అభ్యర్థులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

# ఖమేనీకి కన్నీటి వీడ్కోలు.. పక్కనే 14 నెలల చిన్నారి శవపేటిక..

దేశ జెండాతో కప్పిన ఖమేనీ పార్థివదేహాన్ని నల్ల తలపాగా ఉంచిన శవపేటికలో పెట్టి అంతిమ సందర్శనకు ఉంచారు. అమెరికా దాడుల్లో ప్రాణాలు కోల్పోయిన ఖమేనీ కుటుంబ సభ్యుల పార్థివదేహాలనూ ఆయన పక్కనే ఉంచారు. అందులో ఖమేనీ 14 నెలల మనవరాలి చిన్న శవపేటిక అందరి మనసులను కలచివేస్తోంది. ఆ చిన్నారి శవపేటిక పక్కనే ఆమె ఫొటోను కూడా ఉంచారు. వారం రోజుల అంతిమ సంస్కారాల్లో భాగంగా శుక్రవారం సాయంత్రమే ఖమేనీ పార్థివదేహం టెహ్రాన్‌కు చేరుకుంది. దీంతో గ్రాండ్ మొసల్లా ప్రాంగణం వెలుపల భారీ సంఖ్యలో అభిమానులు, మద్దతుదారులు బారులు తీరారు. శనివారం ఉదయం గ్రాండ్ మొసల్లా ద్వారాలు తెరవగానే వేలాది మంది లోపలికి ప్రవేశించి ఖమేనీకి కన్నీటి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎర్ర జెండాలు చేతబట్టి వచ్చిన మద్దతుదారులు అమెరికాకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్నారు. వారి నినాదాలతో గ్రాండ్ మొసల్లా ప్రాంగణం మార్మోగిపోతోంది. 'నా ప్రియమైన నాయకుడికి వీడ్కోలు చెప్పేందుకు వచ్చాను. ఇలాంటి రోజు వస్తుందని ఎన్నడూ ఊహించలేదు. ఈ విషాదాన్ని చూడకముందే నేను చనిపోయి ఉంటే బాగుండేది' అంటూ ఓ యువకుడు భావోద్వేగానికి గురయ్యాడు. కాగా, రాబోయే మూడు రోజుల్లో ఒక్క టెహ్రాన్‌లోనే 1.5 నుంచి 2 కోట్ల మంది వరకు ఖమేనీ అంత్యక్రియల్లో పాల్గొనే అవకాశం ఉందని ఇరాన్ అధికారులు అంచనా వేస్తున్నారు. మరోవైపు ఇరాన్ పార్లమెంట్ స్పీకర్, అమెరికాతో చర్చలకు ప్రధాన ప్రతినిధిగా వ్యవహరించిన మహమ్మద్ బాఘర్ ఘాలిబాఫ్ సహా పలువురు ప్రముఖులు ఖమేనీకి నివాళులర్పించారు. తాజా దాడుల్లో మరణించిన రివల్యూషనరీ గార్డ్స్ మాజీ చీఫ్ స్థానంలో నియమితులైన అహ్మద్ వాహిదీ కూడా అంతిమ సంస్కారాల్లో పాల్గొన్నారు. భారత్ తరఫున బిహార్ గవర్నర్ సయ్యద్ అటా హుస్సైనీన్, విదేశాంగ శాఖ సహాయ మంత్రి పబిత్ర మార్గెరిటా ఈ కార్యక్రమాలకు హాజరయ్యారు. కాగా, సోమవారం వరకు ఖమేనీ పార్థివదేహాన్ని టెహ్రాన్‌లో ప్రజల సందర్శనార్థం ఉంచనున్నారు. అనంతరం నగరంలో భారీ అంతిమయాత్ర నిర్వహిస్తారు. మంగళవారం నాడు పవిత్ర నగరమైన ఖోమ్‌కు, బుధవారం ఇరాక్‌లోని పవిత్ర ప్రాంతాలకు తీసుకెళ్తారు. గురువారం నాడు ఈశాన్య ఇరాన్‌లోని ఖమేనీ స్వస్థలమైన మష్హద్‌లో ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించనున్నారు.

# పీక్ అవర్స్‌లో మెట్రో ప్రయాణం మరింత కష్టం.. పెరగనున్న నిరీక్షణ సమయం

హైదరాబాద్ మెట్రోలో రద్దీ సమయాల్లో (పీక్ అవర్స్) ప్రయాణించే వారికి నిరీక్షణ తప్పేలా లేదు. రైళ్లలో రద్దీ సమస్యకు ఇప్పట్లో పరిష్కారం లభించే అవకాశాలు కనిపించడం లేదు. కొత్తగా 60 కోచ్‌లను కొనుగోలు చేసే ప్రక్రియ సుమారు రెండేళ్ల పాటు ఆలస్యమయ్యే సూచనలు కనిపిస్తుండటమే ఇందుకు ప్రధాన కారణం. మెట్రో ఫేజ్-1 నిర్వహణను కేంద్ర ప్రభుత్వం నుంచి తెలంగాణ ప్రభుత్వానికి బదిలీ చేసే ప్రక్రియలో జాప్యం నెలకొంది. ఈ బదిలీ పూర్తయ్యాకే కొత్త కోచ్‌ల కోసం ఆర్డర్ ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం భావించినప్పటికీ, కేంద్రం నుంచి వచ్చిన తాజా ఆదేశాలతో ప్రతిపాదన నిలిచిపోయింది. మెట్రో ప్రాజెక్టు విలువను మరోసారి అంచనా వేయాలని కేంద్రం ఆదేశించడంతో కోచ్‌ల కొనుగోలుతో పాటు ఇతర కీలక నిర్ణయాలు వాయిదా పడ్డాయి. ప్రస్తుతం ఎస్‌బీఐ క్యాప్స్ సంస్థ ఈ వాల్యుయేషన్ ప్రక్రియను నిర్వహిస్తోంది. ఇది పూర్తవడానికి సుమారు రెండు నెలల సమయం పట్టవచ్చని, పూర్తి స్థాయి బదిలీ ప్రక్రియ 2026 చివరి నాటికి కొలిక్కి వచ్చే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. ఆ తర్వాతే బెంగళూరుకు చెందిన భారత్ ఎర్త్ మూవర్స్ లిమిటెడ్‌కు కోచ్‌ల తయారీ కోసం ఆర్డర్ ఇవ్వడం సాధ్యమవుతుంది. ఆర్డర్ అందిన తర్వాత కోచ్‌ల తయారీ, సరఫరాకు కనీసం 15 నెలల సమయం పడుతుందని సదరు సంస్థ ఇప్పటికే స్పష్టం చేసింది. ప్రస్తుతం హైదరాబాద్ మెట్రోలో ప్రతిరోజూ సుమారు 4.5 లక్షల మంది ప్రయాణిస్తున్నారు. ముఖ్యంగా ఐటీ కారిడార్, నాగోల్-రాయదుర్గం, ఎల్బీ నగర్-మియాపూర్ వంటి మార్గాల్లో ఉదయం, సాయంత్రం వేళల్లో రైళ్లు ప్రయాణికులతో కిక్కిరిసిపోతున్నాయి. ఈ సమస్య పరిష్కారానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేంద్ర మంత్రులతో సంప్రదింపులు జరుపుతున్నప్పటికీ, బదిలీ ప్రక్రియలోని సాంకేతిక అడ్డంకులు తొలగి కొత్త కోచ్‌లు అందుబాటులోకి వచ్చే వరకు ప్రయాణికులకు రద్దీ కష్టాలు తప్పేలా లేవు.

# పార్టీ పేరు మార్చాలంటూ ఈసీ ఆదేశం.. ఘాటుగా స్పందించిన కవిత

సొంత పార్టీ స్థాపనతో తెలంగాణ రాజకీయాల్లో సరికొత్త ప్రస్థానాన్ని ప్రారంభించాలనుకున్న మాజీ ఎమ్మెల్యే కల్వకుంట్ల కవితకు కేంద్ర ఎన్నికల సంఘం ఊహించని బిగ్ షాక్ ఇచ్చింది. 'తెలంగాణ రక్షణ సేన పేరుతో పార్టీ రిజిస్ట్రేషన్ కోసం ఆమె చేసుకున్న దరఖాస్తుపై ఏకంగా వెయ్యికి పైగా అభ్యంతరాలు వచ్చాయని సీఈసీ వెల్లడించింది. పార్టీ పేరు మార్చాల్సిందేనంటూ ఆదేశాలు జారీ చేసింది. పార్టీ నమోదు ప్రక్రియ ముందుకు సాగాలంటే 15 రోజుల్లోగా మరో మూడు ప్రత్యామ్నాయ పేర్లను తమకు సమర్పించాలని స్పష్టం చేస్తూ కవితకు అధికారికంగా లేఖ రాసింది. నిర్ణీత గడువులోగా కొత్త పేర్లు పంపకపోతే, ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండానే పార్టీ రిజిస్ట్రేషన్ దరఖాస్తును క్లోజ్ చేస్తామని సీఈసీ ఆ లేఖలో కఠినంగా హెచ్చరించింది. ఈసీ పంపిన లేఖపై కల్వకుంట్ల కవిత అత్యంత ఘాటుగా స్పందించారు. ఎన్నికల సంఘం లేఖలో పేర్కొన్న అభ్యంతరాలకు తాము ఇప్పటికే రాతపూర్వక సమాధానాలు ఇచ్చామని తెలిపారు. ఈసీ కోరినట్లుగా ప్రత్యామ్నాయంగా కొత్త పేర్లను పంపే ప్రసక్తే లేదని ఆమె తేల్చిచెప్పారు. 'తెలంగాణ రక్షణ సేన' పేరుపైనే తాము ముందుకు వెళ్తామని, అవసరమైతే ఈ విషయంలో కేంద్ర ఎన్నికల సంఘంపై కోర్టుకు వెళ్లి న్యాయపోరాటం చేయడానికైనా సిద్ధమని కవిత స్పష్టం చేశారు. నిజానికి ఈ ఏడాది ఫిబ్రవరిలో కవిత తన కొత్త పార్టీ కోసం 'తెలంగాణ ప్రజా జాగృతి', 'తెలంగాణ జాగృతి', 'తెలంగాణ రక్షణ సేన', 'తెలంగాణ రాష్ట్ర జాగృతి', 'తెలంగాణ ప్రజా శక్తి' అనే ఐదు పేర్లను ఈసీకి ప్రతిపాదించారు. ఆ తర్వాత ఏప్రిల్ 25న మునీరాబాద్‌లో భారీ ఎత్తున నిర్వహించిన ఆవిర్భావ సభలో... తమ పార్టీ పేరు 'తెలంగాణ రాష్ట్ర సేన' అని కవిత స్వయంగా ప్రకటించి, పార్టీ జెండాను కూడా ఆవిష్కరించారు. అయితే, ఆ తర్వాత కేవలం మూడు రోజుల వ్యవధిలోనే (ఏప్రిల్ 28న) ఈ పేరును 'తెలంగాణ రక్షణ సేన'గా మారుస్తూ, ఈ పేరుపై నెల రోజుల్లోగా ప్రజల నుంచి అభ్యంతరాలు కోరుతూ పత్రికల్లో నోటిఫికేషన్ ఇవ్వాలని ఈసీ ఆదేశించింది. మూడు రోజుల్లోనే 'రాష్ట్ర సేన' కాస్త 'రక్షణ సేన'గా ఎందుకు మారిందనే దానిపై అప్పట్లో పెద్ద ఎత్తున చర్చ నడిచింది. ప్రస్తుతం 'తెలంగాణ రక్షణ సేన' పేరుతోనే కవిత కేడర్‌ను సమాయత్తం చేస్తూ ప్రజా క్షేత్రంలో పోరాటాలు నిర్వహిస్తుండగా... ఇప్పుడు ఏకంగా వేల సంఖ్యలో అభ్యంతరాలు రావడం, ఈ ఈసీ స్పందన నేపథ్యంలో ఈ పేరు కవితకు దక్కుతుందా? లేదా? అనేది ఉత్కంఠగా మారింది.

VARTHAA SAKSHAMU
వార్త సాక్ష్యం తెలుగు దిన పత్రిక
Editor : SAGINALA RAVI KUMAR


# మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజుని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలి







**-జిల్లా టూరిజం అధికారిని కే.విజయలక్ష్మి.**

**నంద్యాల, జులై 4 వార్త సాక్ష్యం**

మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజుని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకుని ఆయన బాటలో నడవాలని జిల్లా టూరిజం అధికారిని కె.విజయలక్ష్మి పేర్కొన్నారు. శనివారం కలెక్టరేట్లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నందు అల్లూరి సీతారామరాజు 129 వ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా టూరిజం అధికారిని విజయలక్ష్మి మాట్లాడుతూ...అల్లూరి సీతారామరాజు భారత స్వాతంత్ర మహా సంగ్రామంలో మహోజ్వల శక్తిగా వెలుగొందారని, అల్లూరి సీతారామరాజు విజయ నగరం సమీపంలోని పాండ్రంగిలో జన్మించారని, ఆరవ తరగతి చదువుతున్న వయసులోనే తండ్రిని కోల్పోవడం ఆయన జీవితంలో పెనుమార్పులే తీసుకువచ్చి oదన్నారు. కొండలు, అడవులలో తిరుగుతూ, గిరిజనుల జీవన విధానాన్ని గమనిస్తూ ఉండేవారని, జ్యోతిష్యం, వాస్తు శాస్త్రం, హఠ యోగం, కవిత్వం నేర్చుకున్నారని, వీటితో పాటు సంస్కృతం, ఆయుర్వేదం కూడా నేర్చుకున్నారన్నారు. ఆ రోజుల్లో ఏజన్సీ ప్రాంతంలోని ప్రజలు తెల్లదొరల చేతిలో అనేక దురాగతాలకు, దోపిడీలకు, అన్యాయాలకు గురయ్యేవారని, శ్రమదోపిడి, ఆస్తుల దోపిడి, స్త్రీల మానహరణం సర్వసాధారణంగా జరుగుతూ మన్యంలో గిరిజనుల జీవితం దుర్భరంగా ఉండేవన్నారు. మన్యం వాసుల కష్టాలను కడతేర్చటానికి, తెల్లదొరల దోపిడీని ఎదుర్కోవడానికి గిరిజనులకు అండగా నిలిచి పోరాడిన మహా వ్యక్తి అల్లూరి సీతారామరాజు అన్నారు.అల్లూరి సీతారామరాజు ఆంధ్రప్రదేశ్ లో జన్మించడం అందులో మన తెలుగువాడిగా పుట్టడం మనం గర్వించదగ్గ విషయమన్నారు. గిరిజన ప్రజల అభ్యున్నతికి పాటుపడిన అల్లూరి సీతారామరాజు 27 ఏళ్ళ వయసులోనే అమరవీరుడయ్యాడని తెలిపారు. దేశ స్వాతంత్రం కోసం తెల్లవారితో పోరాడిన మహావీరుడు అల్లూరి సీతారామరాజును ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ ఏవో సుబాకర్, కలెక్టరేట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ వృత్తి విద్యా జూనియర్ కళాశాలలో ముఖ్య మహనీయుల వర్ధంతి వేడుకలు

**-అల్లూరి సీతారామరాజు జయంతి, స్వామి వివేకానంద వర్ధంతి, పింగళి వెంకయ్య వర్ధంతి కార్యక్రమాలు**

**కర్నూలు జులై 4 వార్త సాక్ష్యం**



ప్రభుత్వ వృత్తి విద్యా జూనియర్ కళాశాలలో మన్యం వీరుడు, అమర స్వాతంత్ర్య సమరయోధుడు అల్లూరి సీతారామరాజు జయంతి, యువతకు స్ఫూర్తిప్రదాత స్వామి వివేకానంద వర్ధంతి, భారత జాతీయ పతాక రూపకర్త పింగళి వెంకయ్య వర్ధంతి సందర్భంగా శనివారం కళాశాలలో ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమని కి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్. నాగస్వామి నాయక్ (గిన్నెస్ బుక్ అఫ్ వరల్డ్ రికార్డు హోల్డర్ ) ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్. నాగస్వామి నాయక్ మాట్లాడుతూ అల్లూరి సీతారామరాజు దేశ స్వాతంత్ర్యం కోసం చేసిన త్యాగాలు, ఆదివాసీల హక్కుల పరిరక్షణ కోసం చేసిన పోరాటం నేటి యువతకు స్ఫూర్తిదాయకమని అన్నారు. అలాగే స్వామి వివేకానంద బోధనలు యువతలో ఆత్మవిశ్వాసం, దేశభక్తి, సేవాభావాన్ని పెంపొందిస్తాయని, పింగళి వెంకయ్య రూపొందించిన త్రివర్ణ పతాకం భారత జాతి గౌరవానికి ప్రతీక అని పేర్కొన్నారు. విద్యార్థులు ఈ మహనీయుల ఆశయాలను ఆదర్శంగా తీసుకొని దేశాభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. అల్లూరి సీతారామరాజు జీవిత చరిత్ర, రంపా తిరుగుబాటులో ఆయన నాయకత్వం, స్వామి వివేకానంద సందేశాలు, పింగళి వెంకయ్య భారత జాతీయ పతాక రూపకల్పనలో చేసిన విశిష్ట సేవలను విద్యార్థులకు వివరించారు. అనంతరం అల్లూరి సీతారామరాజు, స్వామి వివేకానంద, పింగళి వెంకయ్య చిత్రపటాలకు పూలమాలలు సమర్పించి ఘన నివాళులు అర్పించారు. స్వాతంత్ర్య సమరయోధులు, జాతి నిర్మాతలు మరియు ఆధ్యాత్మిక మహనీయుల త్యాగాలు, బోధనలు ప్రతి భారతీయుడు స్మరించుకోవాలని, వారి ఆశయాల సాధనకు యువత ముందుండాలని పిలుపునిచ్చారు. దేశభక్తి గీతాలు ఆలపించి, మహనీయుల ఆశయాలను జీవితంలో ఆచరించాలని ప్రతిజ్ఞ చేశారు.ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు మల్లికార్జున, విజయ శేఖర్, రామకృష్ణ, సోమేష్, ఉల్గోజి రావు, శారధి పటేల్, చిన్న మల్లేష్, కృష్ణ మోహన్, శ్రీధర్ మూర్తి, బాల శంకర్, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు

# తాడేపల్లిగూడెంలో ఆల్ ఇండియా స్టూడెంట్స్ అసోసియేషన్ ఏర్పాటు

**-పశ్చిమ గోదావరి జిల్లా కమిటీ సమావేశంలో ఐసా రాష్ట్ర కార్యదర్శి స్వామిదాసు నాగార్జున**




**విజయవాడ జులై 4 వార్త సాక్ష్యం**

రాష్ట్రంలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలు, ప్రభుత్వ విద్య పరిరక్షణ, విద్యార్థి ఉద్యమాల బలోపేతం, జిల్లా స్థాయిలో చేపట్టాల్సిన కార్యాచరణపై పశ్చిమ గోదావరి జిల్లాలో ఐసా రాష్ట్ర కార్యదర్శి స్వామి దాసు నాగార్జున ఆధ్వర్యంలో జరిగిన సమావేశానికి నూతన కమిటీని నియమించారు ఈ సందర్భంగా ఐసా రాష్ట్ర కార్యదర్శి మాట్లాడుతూ కళాశాలల్లో విద్యార్థి సమస్యలపై పోరాటాలను మరింత ఉధృతం చేయాలని పిలుపునిచ్చారు. జిల్లా కమిటీ సభ్యులు తమ అభిప్రాయాలు, సూచనలు తెలియజేసి, ఉద్యమాలను విస్తృతంగా నిర్వహించాలని నిర్ణయించారు.జిల్లా కార్యదర్శి అప్పల స్వామి,జిల్లా నాయకులు మనోజ్, రెహ్మాన్, దినేష్ వివిధ మండలాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# శ్రీశైల దేవస్థానం లో సాంస్కృతిక కార్యక్రమాలు

**శ్రీశైలం జులై 4 వార్త సాక్ష్యం**



శ్రీశైలం దేవస్థానము నిర్వహిస్తున్న ధర్మపథంలో భాగంగా నిత్యకళారా ధనత్రినేత్ర ఆర్ట్స్ అకాడమీ, హైదరాబాదు ఆధ్వర్యంలో శనివారం ఆలయ ప్రాంగణంలో కూచిపూడి నృత్య ప్రదర్శన కార్యక్రమం ఏర్పాటు చేశారు ఆలయ దక్షిణ మాడవీధిలోని నిత్యకళారాధన వేదిక వద్ద సాయంకాలం నుండి ఈ కూచిపూడి నృత్య ప్రదర్శన కార్యక్రమం నిర్వహించారు తాండవ గణపతి, భో...శంభో, శివతాండవం, హర హర శంభో, నమోనమో నటరాజ, దేవికైవారం తదితర గీతాలకు రవి కుమార్, వందన, అక్షర, దీక్ష, హిమబిందు తదితరులు నృత్యప్రదర్శన చేయనున్నారు.ఈ నిత్య కళారాధనలో ఆయా రోజులలో హరికథ, బుర్రకథ, సంప్రదాయ నృత్యం, వాయిద్య సంగీతం, భక్తిరంజని లాంటి కార్యక్రమాలు ఏర్పాటు చేయబడు తున్నాయి. శ్రీస్వామిఅమ్మవార్లకు ఆయా కైంకర్యాలన్నీ పరిపూర్ణంగా జరగాలని ప్రాచీన సంప్రదాయ కళల పరిరక్షణలో భాగంగా ఈ నిత్యకళారాధన కార్యక్రమాలు ఆలయ పరిధిలో ప్రతిరోజు కొనసాగిస్తూ ఉంటారు.

# ఐకమత్యంతోనే హక్కుల సాధన సాధ్యం









మల్లికార్జున, నగర ప్రధాన కార్యదర్శి



ఎన్. చిన్న నాగేశ్వర రావు, కర్నూలు నగర అధ్యక్షులు

**- జర్నలిస్టుల హక్కుల కోసం నిరంతరం పాటుపడుతున్న సంస్థ ఏపీయూడబ్ల్యూజే**

**-నగర అధ్యక్షులుగా నాగేశ్వర రావు, ప్రధాన కార్యదర్శిగా మల్లికార్జున ఎన్నిక**

**కర్నూలు జులై 4 వార్త సాక్ష్యం**

ఐకమత్యంతోనే హక్కుల సాధన సాధ్యమని ఐజేయూ జాతీయ కార్యవర్గ సభ్యులు, ఏపీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షులు ఈ. ఎన్.రాజు, జాతీయ సమితి సభ్యులు కె. నాగరాజు, రాష్ట్ర ఉపాధ్యక్షులు జి. కొండప్ప లు అన్నారు. ఈ మేరకు శనివారం కర్నూలు నగరంలోని సీ-క్యాంప్ లోని ఏపీ ప్రభుత్వ డ్రైవర్స్ అసోసియేషన్ కళ్యాణ మంటపంలో ఏపీయూ డబ్ల్యూజే జిల్లా కార్యవర్గ సభ్యులు చిరంజీవి అధ్యక్షతన శనివారం నిర్వహించిన ఏపీయూడబ్ల్యూజే నగర మహాసభలో వారు పాల్గొని మాట్లాడారు. జర్నలిస్టుల భద్రత, సంక్షేమం, హక్కుల కోసం నిరంతరం పోరాడుతున్న సంస్థ ఏపీయూడబ్ల్యూజే అన్నారు. అధికారంలో ఎవరు ఉన్నా.. జర్నలిస్టుల సమస్యమే మిన్నగా భావిస్తూ.. ముందుకు వెళు తున్నామన్నారు. అన్ని జిల్లా కేంద్రాల్లో ప్రెస్ క్లబ్ లు ఉన్నాయని, కర్నూలు నగర కేంద్రంలో మాత్రం ఇంత వరకు ప్రెస్ క్లబ్ లేకపోవడం బాధాకరమన్నారు. జర్నలిస్టు లందరిని కలుపుకొని ప్రెస్ ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు. అలాగే జర్నలిస్టులకు ఇంటి స్థలంతో పాటు ఇళ్లు నిర్మించి ఇస్తామని కూటమి ప్రభుత్వం తమ మానిఫెస్టోలో పెట్టిందని, ఎన్నికల ముందు కాకుండా ఇప్పుడే అందరికీ ఇళ్ల స్థలాలతో పాటు ఇళ్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాగే 2026 - 2027 కు సంబంధించి ఏపీయూడబ్ల్యూజే సంఘం సభ్యత్వం మొదలు పెట్టబోతున్నామని, ప్రతి ఒక్కరూ తమ సభ్యత్వాన్ని రెన్యువల్ చేయించుకోవాలని విజ్ఞప్తి చేశారు. అలాగే కొత్తగా సభ్యత్వం తీసుకోవాలని అనుకునే వారు కూడా తీసుకోవచ్చున్నారు. రెన్యువల్ చేయించుకోవాలను కునే వారు రూ.150లు, కొత్తగా తీసుకునే వారు రూ.200లు రుసుము చెల్లించాల్సి ఉంటుందన్నారు. అందరూ సభ్యత్వం తీసుకొని జర్నలిస్టుల ఐక్యత చాటాలని కోరారు. అనంతరం నగర నూతన కమిటిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నగర నూతన కమిటీ ఏపీయూడబ్ల్యూజే నగర అధ్యక్షులుగా దిశ ఉమ్మడి జిల్లా స్టాఫర్ ఎన్. చిన్న నాగేశ్వర రావు, ప్రధాన కార్యదర్శిగా ఆంధ్రజ్యోతి రిపోర్టర్ బి.మల్లికార్జున, కోశాధికారిగా యమ్మని శివ, ఉపాధ్యక్షులుగా రమేష్, అసిఫ్, ఎల్లాగౌడ్, సహాయ కార్యదర్శులు గా రమేష్ రెడ్డి, రవిరాజ్, సూరి కార్యవర్గ సభ్యులుగా మధు సూదన రాజు, స్వామిదాసు గారి నాగేంద్ర, గజేంద్ర లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం నూతనంగా ఎన్నికైన వారిని జిల్లా కమిటీ సభ్యులు ఘనంగా సత్కరించారు. అలాగే నగర కమిటీ సభ్యులు జిల్లా కమిటీ సభ్యులను శాలువా, మెమెంటో లతో సత్కరించారు. కార్యక్రమంలో ఏపీయూడబ్ల్యూజే జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి సుంకన్న, కోశాధికారి అంజి, సహాయ కార్యదర్శులు శివ రాజ్ కుమార్, అవినాష్, సీనియర్ జర్నలిస్టు శ్రీనాథ్, ఏపీ ఫొటో జర్నలిస్టు అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు వీడియో అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు స్నేహాల్, రఫీ, అంజి తదితరులు పాల్గొన్నారు.

# రంగా సేవలు చిరస్మరణీయం

-పేదల కోసం పోరాడిన ప్రజానాయకుడు రంగా అని కొనియాడిన తాంద్ర సాంబశివరావు



బాపట్ల జులై 4 వార్త సాక్ష్యం

వంగవీటి మోహన రంగా 79వ జయంతి సందర్భంగా బాపట్ల పట్టణంలోని భీమవారిపాలెం సెంటర్‌లో ఉన్న ఆయన విగ్రహానికి ఎంపీటీసీ సభ్యుడు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ సైనిక సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు తాంద్ర సాంబశివరావు పూలమాల వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ఆయన రంగా జయంతి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా తాంద్ర సాంబశివరావు మాట్లాడుతూ, పేదలు, బడుగు--బలహీన వర్గాల హక్కుల కోసం నిరంతరం పోరాడిన ప్రజానాయకుడు వంగవీటి మోహన రంగా అని కొనియాడారు. ప్రజా సమస్యల పరిష్కారానికి అంకితభావంతో పనిచేసిన రంగా సేవలు చిరస్మరణీయమని అన్నారు. నిరాహార దీక్ష చేస్తున్న సమయంలో రంగా హత్యకు గురికావడం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ చరిత్రలో ఒక విషాద ఘటనగా ప్రజల మదిలో చిరస్థాయిగా నిలిచిపోయిందని పేర్కొన్నారు. రంగా ఆశయాలకు అనుగుణంగా ప్రతి ఒక్కరూ పేదల అభ్యున్నతి, సామాజిక న్యాయం కోసం కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. బాపట్ల నియోజకవర్గ ప్రజాప్రతినిధిగా, మాజీ సైనిక సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా ప్రజలకు వంగవీటి మోహన రంగా జయంతి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఏపీఆర్ఎంఎస్ఎస్ఎస్ రాష్ట్ర కమిటీ గౌరవ సలహాదారు సుంకర శేషగిరిరావు, బాపట్ల అసోసియేషన్ ఉపాధ్యక్షుడు చలికొండ వెంకట కృష్ణారావు, సీనియర్ మాజీ సైనికుడు పసుపులేటి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## సర్ ప్రక్రియలో బిఎల్ఓలకు ఆర్డిఓ దిశానిర్దేశం

-జాప్యంపై చర్యలు.. సిబ్బందికి ఆర్డీవో హరికుమార్ హెచ్చరిక



పిట్టలవానిపాలెం జులై 4 వార్త సాక్ష్యం

ఓటరు జాబితా ప్రత్యేక సంక్షిప్త సవరణ (ఎస్ఈఆర్) ప్రక్రియను గడువులోగా పూర్తి చేయాలని బాపట్ల సబ్‌డివిజన్ పరిధి సిబ్బందికి ఆర్డీవో హరికుమార్ కఠిన ఆదేశాలు జారీ చేశారు. బాపట్ల జిల్లా కలెక్టర్ వాసుదేవ వినోద్ కుమార్ ఆదేశాల మేరకు ఎస్ఈఆర్ ప్రక్రియను శరవేగంగా నిర్వహించేందుకు చర్యలు చేపట్టారు. ప్రతిరోజూ బాపట్ల సబ్‌డివిజన్ పరిధిలోని పోలింగ్ కేంద్రాలను సందర్శిస్తూ బూత్ లెవల్ అధికారులు (బీఎల్‌వోలు)తో కలిసి ఇంటింటికీ వెళ్లి ఓటర్ల వివరాల పరిశీలనను స్వయంగా పర్యవేక్షిస్తున్నారు. క్షేత్రస్థాయిలో ఎక్కడా జాప్యం లేకుండా సిబ్బంది పనిచేయాలని స్పష్టం చేశారు. ఈ నెల 14వ తేదీ వరకు మాత్రమే ఎస్ఈఆర్ ప్రక్రియ కొనసాగనున్న నేపథ్యంలో అర్హులైన ప్రతి ఓటరిని తప్పనిసరిగా చేరుకోవాలని, ప్రజలు కూడా సిబ్బందికి సహకరించి ప్రక్రియను విజయవంతం చేయాలని హరికుమార్ కోరారు. ఎస్ఈఆర్ ప్రక్రియలో నిర్లక్ష్యం ప్రదర్శించినా, పనులను గడువులోగా పూర్తి చేయకపోయినా సంబంధిత సిబ్బందిపై కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. ప్రభుత్వ ప్రతిష్టాత్మక కార్యక్రమాన్ని వేగవంతంగా, పారదర్శకంగా పూర్తి చేయడంపై ప్రత్యేక దృష్టి సారించాలని సిబ్బందికి ఆదేశించారు.

# సిరివెళ్ల విద్యాసంస్థలు,అంగన్వాడి కేంద్రాలపై ఆకస్మిక తనిఖీలు





-పిల్లలకు నాణ్యమైన ఆహారం అందిస్తున్నారా...?

-స్వయంగా పరిశీలించిన రాష్ట్ర ఫుడ్ కమిషనర్ చిత్త విజయ ప్రతాప్ రెడ్డి




నంద్యాల జులై 4 వార్త సాక్ష్యం

నంద్యాల జిల్లాలో పర్యటించిన ఫుడ్ కమిషనర్ చిత్త విజయ ప్రతాప్ రెడ్డి శనివారం సిరివెళ్ల మండల కేంద్రంలోని పలు విద్యాసంస్థలు,అంగన్వాడి కేంద్రాలపై ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. జిల్లా పరిషత్ హై స్కూల్,కస్తూర్బా బాలికల విద్యాలయం (హాస్టల్), ప్రాథమిక ఉన్నంత పాఠశాల,ఏపీ మోడల్ స్కూల్,ఏపీ మోడల్ కాలేజ్‌తో పాటు పలు అంగన్వాడి కేంద్రాలను సందర్శించి విద్యార్థులకు, చిన్నారులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనం నాణ్యతను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ స్వయంగా వంటగదిలోకి వెళ్లి ఆహార పదార్థాలను తనిఖీ చేశారు. ముఖ్యంగా కోడిగుడ్ల నాణ్యత,వంట పరిశుభ్రత,ఆహార నిల్వ విధానం వంటి అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో నేరుగా మాట్లాడిన చిత్త విజయ ప్రతాప్ రెడ్డి, “మీకు ప్రతిరోజూ నాణ్యమైన భోజనం అందుతున్నదా? కోడిగుడ్లు, ఇతర పోషకాహారం సక్రమంగా ఇస్తున్నారా? ”అని అడిగి వివరాలు తెలుసుకున్నారు. విద్యార్థుల నుంచి వచ్చిన స్పందనను నమోదు చేసుకుని సంబంధిత అధికారులకు అవసరమైన సూచనలు చేశారు. ప్రభుత్వం, విద్యార్థులు, చిన్నారులకు అందిస్తున్న పోషకాహారం నాణ్యతలో ఎలాంటి రాజీ ఉండకూడదని, పరిశుభ్రత ప్రమాణా లను తప్పనిసరిగా పాటించాలని సంబంధిత సిబ్బం దికి కమిషనర్ ఆదేశించారు. పిల్లల ఆరోగ్యమే ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యమని పేర్కొంటూ, ఇటువంటి ఆకస్మిక తనిఖీలు జిల్లాలోని అన్ని విద్యాసంస్థలు, అంగన్వాడి కేంద్రాల్లో నిరంతరం కొనసాగుతాయని ఆయన స్పష్టం చేశారు.

# యాగంటిపల్లె హనుమంతరాయ ఎడ్యుకేషనల్ చారిటబుల్ సొసైటీ కృషి






-విజ్ఞాన కేంద్ర వ్యవసాయ శాఖ

నందికొట్కూరు జులై 4 వార్త సాక్ష్యం

పట్టణంలో కన్యకా పరమేశ్వరి దేవస్థానం నందు డా. జి ధనలక్ష్మి, సీనియర్ సైంటిస్ట్ ఢ హెడ్, కేవీకే కిసాన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఖేత్ బచావో అభియాన్ మేళా కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా నందికొట్కూరు నియోజకవర్గ ఎమ్మెల్యే గిత్త జయసూర్య పేర్కొన్నారు జ్యోతి ప్రజ్వలన చేసికార్యక్రమాన్నని ప్రారంభించారు అనంతరం ఏర్పాటు చేసిన సమావేశం లో ఎమ్మెల్యే గిత్త జయసూర్య మాట్లాడుతూ ఖేత్ బచావో అభియాన్' లక్ష్యాలు భూసార సంరక్షణలు నేల ఆరోగ్యాన్ని కాపాడి, సారవంతమైన పంటలను పండించడం ద్వారా సహజ సాగు పురుగుమందుల వాడకాన్ని తగ్గించి, సేంద్రీయ వ్యవసాయానికి ప్రాధాన్యత అన్నారు,నేల ఆరోగ్య పరిరక్షణపై రైతులు అవగాహన పెంచుకోవాలని. ఎరువులు పరిమితంగా వాడి ఖర్చు మాత్రమే కాకుండా నేల ఆరోగ్యం మెరుగు పరుచుకోవాలని సూచించారు. పంట మార్పిడి పద్ధతులు ఆవలంభించి పంట దిగుబడులు పెంచుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర యాదవ్ కార్పొరేషన్ డైరెక్టర్ కడియం వెంకటేశ్వర్లు యాదవ్, నందికొట్కూరు సొసైటీ చైర్మన్ మూర్తి జావలి, నందికొట్కూరు ఏ డి ఏ, గిరీష్, కేవీకే అడ్మినిస్ట్రేటివ్ అధికారి సురేష్ కుమార్, కేవీకే శాస్త్రవేత్తలు రమణయ్య, సుధాకర్, బాలరాజు, కృష్ణమూర్తి, రవి గౌడ్, లక్ష్మీప్రియ, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, వివిధ గ్రామాల రైతులు పాల్గొన్నారు

# ఇన్-సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్, మినహాయింపు కల్పించాలి





-రాష్ట్ర మంత్రి ఎన్ఎండి ఫరూక్ కు ఫ్యాప్టో వినతి

నంద్యాల, జూలై 4 వార్త సాక్ష్యం

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయశాఖ మరియు మైనార్టీ సంక్షేమ శాఖ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మంత్రివర్యులు ఎన్ఎండి ఫరూక్ ను శనివారం నంద్యాలలో వారి క్యాంపు కార్యాలయంలో ‘ఫ్యాప్టో’ (ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఆర్గనైజేషన్స్) ప్రతినిధులు కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఫ్యాప్టో,ప్రతినిధులు,మాట్లాడుతూ, ప్రస్తుతం ఇన్-సర్వీస్ ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న టెట్ సమస్యను మంత్రి ఫరూక్ దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు. విద్యా హక్కు చట్టం-2009 మరియు ఎన్.సి.టి.ఇ నిబంధనల ప్రకారం ఉపాధ్యాయ నియామకాలకు టెట్ ఉత్తీర్ణత తప్పనిసరి అని, అయితే సుప్రీంకోర్టు తీర్పుల నేపథ్యంలో ఇన్-సర్వీస్ టీచర్లు కూడా టెట్ పాస్ కావాల్సిన పరిస్థితి ఏర్పడిందని పేర్కొన్నారు. దీనివల్ల సుదీర్ఘ కాలంగా విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కావున, ఉపాధ్యాయుల ప్రయోజనాల దృష్ట్యా, కేంద్ర ప్రభుత్వానికి సిఫార్సు చేసి విద్యా హక్కు చట్టంలోని సెక్షన్ 23(1) ని సవరించేలా చొరవ చూపాలని మంత్రి ఫరూక్ ని కోరారు. అలాగే, ఇన్-సర్వీస్ ఉపాధ్యాయుల కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా టెట్ పరీక్షను నిర్వహించాలని, ఇందులో 40 శాతం అర్హత మార్కులు ఉండేలా బోధనాంశాల ఆధారంగా సిలబస్ రూపొందించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. తమ సమస్యలను సావధానంగా విన్న మంత్రి ఎన్ఎండి ఫరూక్ ఉపాధ్యాయుల ఇబ్బందులను పరిగణనలోకి తీసుకుని, ఈ అంశంపై సానుకూల నిర్ణయం కోసం సంబంధిత ఉన్నతాధికారులతో చర్చిస్తానని ప్రభుత్వం తరపున తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు ఈ కార్యక్రమంలో ఫ్యాప్టో నంద్యాల జిల్లా సెక్రటరీ దస్తగిరి, చైర్మన్ రామ చంద్రారెడ్డి, దీప్యూటీ సెక్రటరీ జనరల్ పి. వి. ప్రసాద్, శ్రీనివాసులు, చైర్మన్ ఎల్.సాయి శ్రీనివాస్, ఉర్దూడిఐ అస్మద్దీన్, సెక్రటరీ జనరల్ ఎస్.చిరంజీవి, కో-చైర్మన్లు కె.నరహరి , చిట్టెటి రమేష్ , చందోలు వెంకటేశ్వర్లు , కె.ప్రకాశరావు , డిప్యూటీ సెక్రటరీ జనరల్స్ ఎన్.వెంకటేశ్వర్లు , కె.బసవ లింగారావు , గుత్తా శ్రీనివాసరావు , కోశాధికారి చింతల సుబ్బారావు , కార్యదర్శులు సయ్యద్ ఇక్బాల్ , డి.మధుసూదనరావు ,ఎం.ప్రవీణ్ కిరణ్ తదితర ఉపాధ్యాయ సంఘాల నాయకులు పాల్గొన్నారు

వార్త సాక్ష్యం
Editor : SAGINALA RAVI KUMAR
తెలుగు దిన పత్రిక
ఆదివారం 5 జూలై 2026

# సర్ , ఓట్ల ప్రక్రియను జూలై నెలాఖరు వరకు కొనసాగించాలి

-ఆత్మకూరు రెవెన్యూ డివిజనల్ అధికారి వెంకట శివకు వినతి పత్రం

-సిపిఐ (ఎంఎల్) పార్టీ జిల్లా కార్యదర్శి, పిక్కిలి వెంకటేశ్వర్లు

నందికొట్కూరు జులై 4 వార్త సాక్ష్యం

శనివారం పట్టణంలోని ఆత్మకూరు రెవెన్యూ డివిజనల్ అధికారి వెంకట శివ కు నందికొట్కూరు తాసిల్దార్ కార్యాలయంలో రాజకీయ పార్టీల సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా, ఆర్డిఓ హాజరయ్యారు సమావేశం అనంతరం లిబరేషన్ పార్టీ ఆధ్వర్యంలో వినతిపత్రం ఇవ్వడం జరిగింది, అనంతరం ఆర్డీవో,తో పిక్కిలి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ,ఏపీ ,రాష్ట్రవ్యాప్తంగా ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు నంద్యాల జిల్లాలో ఓటు సర్వే చేపడుతున్నారని అయితే బి ఎల్ ఓ లు సిబ్బంది కొరతతో స్టాఫ్ లేకుండా ఒంటరిగా సర్వే చేపడుతున్నారని సిబ్బంది లేకపోవడంతో ఓటర్ల పక్రియ వేగవంతంగా జరగడంలేదని 100 శాతానికి కేవలం 44 శాతం మాత్రమే నమోదు అయిందని ఇంకా సమయం పది రోజులు మాత్రమే మిగిలి ఉండడం వల ప్రజలు ఓటు కోల్పోయే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు ఓటరుకు ఒక స్లిప్పు ఇవ్వవలసి ఉండగా ఆ స్లిప్పును సచివాలయా సిబ్బంది తీసుకు వెళు తున్నారని దీనివలన ఓటు బిఎల్ఓ బిఎల్ఎ మధ్యల ఓటు మిస్ అయ్యే ప్రమాదం ఉందని ప్రజలు చర్చించుకుంటున్నారని వారన్నారు అందువల ఓటర్ నమోదు అయినటువంటి వారికి బిఎల్ఓ ల ద్వారా ఓటు మెసేజ్ ని వచ్చే విధంగా చేయాలని డిమాండ్ చేశారు దీనికి తోడు 2002 లో ఎక్కడ మీకు ఓటు ఉందో ఆ ఐడి నెంబర్ను వారసత్వంగా చూసి వేయాలని నిబంధన పెట్టడం రాజ్యాంగవిరుద్ధమన్నారు, సమాజంలో ఉన్న ప్రతి పౌరునికి ఓటు హక్కు కలిగించే విధంగా రాజ్యాంగం రాయబడిందని దాన్ని తిరస్కరించే హక్కు ఎన్నికల కమిషన్కు లేదన్నారు దీన్నతోపాటు 15 రకాల ప్రభుత్వ సేవల ద్వారా గుర్తింపు పొందిన ఐడి చూపించిన ఓటు సరిపోతుందని నిబంధన ఉందని వాటిని పరిగలోకి తీసుకోవాలని అన్నారు ప్రజలు ఓటు పోతుందనే భయాందోళనలో ఉన్నారని అనేకమందికి ఓటు ఫారం రాసేటువంటి పరిస్థితి కూడా లేదన్నారు అందువలన రాష్ట్ర ఎన్నికల కమిషనర్,1000, మందికి ఒక బిఎల్ ఓ నియమించ వలన ప్రక్రియ పూర్తి కాలేదన్నారు అందువలన, కనీసం నలుగురు సిబ్బందిని పొడిగించాలని సర్ ప్రక్రియను జూలై నెలఆఖరు వరకు పొడిగించాలని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో నందికొట్కూర్ మండల కార్యదర్శి కాటేపోగు సామన్న వడ్డే సుధాకర్ ఎస్ మహబూబ్ బాషా తదితరులు పాల్గొన్నారు.



# ప్రజలకు పొంచి ఉన్న పెద్ద స్థంభం ప్రమాదం

-కొత్త స్తంభాలు వేసి.. వదిలేసిన వైనం

-కొత్త విద్యుత్ స్తంభాలకు తీగలు ఏర్పాటు చేయాలి సిపిఎం

ఆత్మకూరు జులై 4 వార్త సాక్ష్యం

మున్సిపాలిటీ పరిధిలోని అర్బన్ కాలనీలో ఎన్ లక్ష్మీ ఇంటి ముందర గల ఒక విద్యుత్ స్తంభం తీవ్రంగా దెబ్బతిని, ఏ క్షణమైనా కూలిపోయే స్థితిలో ఉంది. వీటి స్థానంలో కొత్త స్తంభం వేసి ఐదు సంవత్సరాలైనా నేటికి విద్యుత్ తీగ లాగకపోవడం, విద్యుత్ వైర్లు లాగడానికి ఉంచినటువంటి పరికరాలను కూడా తీసుకెళ్లడం విడ్డూరంగా ఉందన్నారు. ఈ ప్రమాదకర పరిస్థితిపై కాలనీ ప్రజలు భయాందోళన వ్యక్తం చేస్తున్నప్పటికీ, అధికారులు పట్టించుకోకపోవడాన్ని నిరసిస్తూ సిపిఎం నాయకులు మరియు కాలనీ ప్రజలు శనివారం కాలనీలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఎం పార్టీ పట్టణ కార్యదర్శి ఏ. రణధీర్, శాఖ కార్యదర్శి షైక్ ఇస్మాయిల్ లు మాట్లాడుతూ కాలనీలోని ఎం లక్ష్మి ఇంటి ముందర ప్రధాన వీధిలో ఉన్న ఒక సిమెంటు విద్యుత్ స్తంభం అడుగు భాగంలో పూర్తిగా విరిగిపోయి, కేవలం లోపల ఉన్న ఇనుప తీగలపై ఆగి ఉంది. స్తంభం ఒక వైపుకు బాగా వంగి ఉండటంతో, అది ఎప్పుడు ఎవరి మీద పడుతుందోనని స్థానికులు వణికిపోతున్నారు. ముఖ్యంగా చిన్న పిల్లలు, వృద్ధులు తిరిగే ఈ ప్రాంతంలో భారీ ప్రమాదం పొంచి ఉందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు బాధ్యతారా హిత్యంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. ప్రమాదకరంగా ఉన్న ఈ పాత స్తంభాన్ని తొలగించి, వెంటనే నూతన విద్యుత్ స్తంభాన్ని ఏర్పాటు చేయాలి.

-అధికారుల నిర్లక్ష్యం:

పలుమార్లు విద్యుత్ శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా "రేపు మాపు" అంటూ కాలయాపన చేస్తున్నారని, ఏదైనా ప్రాణనష్టం జరిగితే ఎవరిది బాధ్యత అని ప్రశ్నించారు. భద్రత ముఖ్యంగా కాలనీలో వేలాడుతున్న విద్యుత్ తీగలను కూడా సరిచేసి, ప్రజల ప్రాణాలకు రక్షణ కల్పించాలని కోరారు. గాలులు వీచినప్పుడు లేదా వర్షం పడినప్పుడు స్తంభం ఊగుతోందని, ఆ సమయంలో భయంతో ఇళ్లలోనే ఉండిపోతున్నామని చెప్పారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి, పెను ప్రమాదం జరగకముందే చర్యలు తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమం లో కాలనీ ప్రజలు నాగరాజు, నూర్ అహ్మద్,గూడ్ సా, సయ్యద్ ఇస్మాయిల్, భాష, ఎన్. లక్ష్మి, కృష్ణవేణి, రాములమ్మ, నాగమ్మ, అమినాబి, పార్వతమ్మ, లక్ష్మీదేవి,తదితరులు పాల్గొన్నారు. సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో జరిగిన నిరసనకు స్పందించిన విద్యుత్ శాఖ అధికారులు పట్టణంలోని అర్బన్ కాలనీలో సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో విద్యుత్ శాఖ పై జరిగిన నిరసన కార్యక్రమానికి వెంటనే ఆత్మకూరు విద్యుత్ శాఖ అధికారులు స్పందించి కాలనీలో కొత్త స్తంభానికి వైర్లు లాగి సమస్యను పరిష్కారం చేసిన విద్యుత్ శాఖ అధికారులకు సిబ్బందికి కాలనీ ప్రజలు అభినందనలు తెలిపారు



# చందోలు బండ్లమ్మ ఆలయానికి సంపూర్ణ చేయూత

-అభివృద్ధి కి ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులకు దేవాదాయ కమిషనర్ ఆదేశం

-ఎమ్మెల్యే తో కలిసి ఆలయాన్ని సందర్శించిన రామచంద్ర మోహన్

బాపట్ల,జులై 4 వార్త సాక్ష్యం

బాపట్ల జిల్లా చందోలులోని చారిత్రాత్మక శ్రీ బండ్లమ్మ అమ్మవారి ఆలయాన్ని భక్తులకు మరింత సౌకర్యవంతంగా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర దేవాదాయ శాఖ సమగ్ర ప్రణాళిక రూపొందిస్తోంది. ఆలయాన్ని సందర్శించిన దేవాదాయ శాఖ కమిషనర్ కె. రామచంద్ర మోహన్, ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మతో కలిసి అభివృద్ధి పనులపై చర్చించారు. క్యూ కాంప్లెక్స్, ప్రహరీ, ఉచిత తాగునీరు, ఆధునిక మరుగుదొడ్లు, ప్రత్యేక ప్రవేశ--నిష్క్రమణ మార్గాల ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ఆలయ అభివృద్ధికి అవసరమైన నిధులు కేటాయించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని కమిషనర్ హామీ ఇచ్చారు.బాపట్ల జిల్లా చందోలులోని చారిత్రాత్మక శ్రీ బండ్లమ్మ అమ్మవారి ఆలయాన్నిఅ రాష్ట్రంలోనే ఆదర్శ ఆలయంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టనుంది. రాష్ట్ర దేవాదాయ శాఖ కమిషనర్ కె. రామచంద్ర మోహన్ శనివారం బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మతో కలిసి ఆలయాన్ని సందర్శించి, అక్కడి పరిస్థితులను పరిశీలించారు. ఆలయానికి ఉన్న చారిత్రక ప్రాధాన్యం, ప్రతి సంవత్సరం తరలివచ్చే భక్తుల సంఖ్య, భవిష్యత్తులో పెరగనున్న రద్దీని దృష్టిలో ఉంచుకొని సమగ్ర అభివృద్ధి ప్రణాళికను రూపొందించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.ఆలయ కమిటీ సభ్యులు, అధికారులు కమిషనర్‌కు ఆలయంలో ఇప్పటివరకు చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. ఎమ్మెల్యే నరేంద్ర వర్మ తన సొంత నిధుల నుంచి సుమారు రూ.9.50 లక్షలు వెచ్చించి ఆలయానికి అనేక వసతులు కల్పించిన విషయాన్ని కమిషనర్ దృష్టికి తీసుకువచ్చారు. ఆలయ అభివృద్ధి కోసం ప్రజాప్రతినిధులు, స్థానిక కమిటీ సభ్యులు చూపుతున్న





చొరవ అభినందనీయమని కమిషనర్ పేర్కొన్నారు. భక్తుల సౌకర్యాలే లక్ష్యం..ఆలయానికి వచ్చే భక్తుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోందని, ముఖ్యంగా పండుగలు, సెలవు దినాల్లో భారీ రద్దీ ఏర్పడుతోందని కమిషనర్ తెలిపారు. దీనిని దృష్టిలో ఉంచుకుని ఆలయానికి ప్రత్యేక ప్రవేశ మార్గం, దర్శనం అనంతరం బయటకు వెళ్లేందుకు ప్రత్యేక నిష్క్రమణమార్గాన్ని ఏర్పాటు చేయాలని సూచించారు. అలాగే శాశ్వత షెడ్లతో కూడిన ఆధునిక క్యూ కాంప్లెక్స్ నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు.భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ ప్రాంగణాన్ని విస్తరించడం, చుట్టూ బలమైన ప్రహరీ నిర్మాణం చేపట్టడం అవసరమని అభిప్రాయపడ్డారు. ఆలయం చుట్టూ ఉన్న ఖాళీ స్థలాన్ని అభివృద్ధి చేసి, భక్తులు ప్రశాంతంగా నడవడానికి అనువైన మార్గాలను ఏర్పాటు చేయాలని సూచించారు.ఉచిత తాగునీరు, ఆధునిక వసతులు...దూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తుల కోసం ఉచిత మినరల్ వాటర్ ప్లాంట్లు ఏర్పాటు చేయాలని కమిషనర్ ఆదేశించారు. అలాగే పురుషులు, మహిళలకు విడివిడిగా అత్యాధునిక మరుగు దొడ్లు, స్నానపు గదులను నిర్మించాలని సూచించారు. భక్తులు తమ మొక్కుబడులు సులభంగా చెల్లించుకు నేందుకు అవసరమైన సౌకర్యాలను ఆధునీకరించాలని పేర్కొన్నారు. ఆలయంలో ఆధ్యాత్మిక వాతావరణాన్ని మరింత పెంపొందించేలా పర్యావరణ అనుకూల మార్పులు చేయాలని, భక్తులకు మానసిక ప్రశాంతత కలిగించేలా పచ్చదనాన్ని పెంపొందించాలని సూచించారు. నిధుల కేటాయింపుకు చర్యలు.. ఆలయానికి ఉన్న సొంత ఆదాయ వనరులతో పాటు దేవాదాయ శాఖకు చెందిన కామన్ గుడ్ ఫండ్ (సీజీఎఫ్) నిధుల నుంచి కూడా అభివృద్ధి పనులకు నిధులు కేటాయించేలా ప్రతిపాదనలు సిద్ధం చేయాలని కమిషనర్ అధికారులను ఆదేశించారు. ఆలయ అభివృద్ధి కోసం తక్షణం చేపట్టాల్సిన పనులపై ఎమ్మెల్యే నరేంద్ర వర్మతో ప్రత్యేకంగా చర్చించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే నరేంద్ర వర్మ మాట్లాడుతూ, చందోలు బండ్లమ్మ ఆలయం చారిత్రక, ఆధ్యాత్మిక ప్రాధాన్యం కలిగిన క్షేత్రమని, భక్తులకు మరిన్ని సౌకర్యాలు కల్పించేందుకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. అలాగే బాపట్ల జిల్లా కేంద్రంలోని తూర్పు సత్రం, ఇతర దేవాదాయ శాఖ పరిధిలోని ఆలయాల అభివృద్ధికి కూడా నిధులు కేటాయించాలని కమిషనర్ దృష్టికి తీసుకువచ్చారు.ఆయా సమస్యలపై సానుకూలంగా స్పందించిన కమిషనర్ రామచంద్ర మోహన్, ఎమ్మెల్యే సూచనల మేరకు అవసరమైన ప్రతిపాదనలను ప్రభుత్వం పరిశీలిస్తుందని, దేవా దాయ శాఖ పరిధిలోని ఆలయాల అభివృద్ధికి అన్ని విధాలా సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం ఆలయ కార్యనిర్వహణాధికారి ఘంటసాల నరసింహమూర్తి పర్యవేక్షణలో దేవాదాయ శాఖ కమిషనర్ రామచంద్ర మోహన్, ఎమ్మెల్యే నరేంద్ర వర్మ ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారి ఆశీస్సులు పొందారు. స్థానిక ప్రజాప్రతినిధులు, ఆలయ కమిటీ సభ్యులు, అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# వీరుడికి పోలీసుల వందనం

-జిల్లా పోలీస్ కార్యాలయంలో జయంతి వేడుకలు ఘనంగా



బాపట్ల జులై 4 వార్త సాక్ష్యం

మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు జీవితాన్ని ఆదర్శంగా తీసుకుని నేటి యువత దేశభక్తి, నాయకత్వ లక్షణాలను అలవర్చుకోవాలని జిల్లా ఎస్పీ బి. ఉమామహేశ్వర్ ఐపీఎస్ సూచించారు. అల్లూరి సీతారామరాజు జయంతి సందర్భంగా శనివారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన చిత్రపటానికి ఎస్పీ పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ భారత స్వాతంత్ర్య ఉద్యమ చరిత్రలో అల్లూరి సీతారామరాజు సాహసోపేత పోరాటం చిరస్మరణీయమన్నారు. బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా గిరిజనుల హక్కుల కోసం సాయుధ పోరాటం సాగించి ప్రాణత్యాగం చేసిన మహోన్నత యోధుడిగా చరిత్రలో నిలిచిపోయారని కొనియాడారు. ఆయన ధైర్యసాహసాలు, త్యాగనిరతి, దేశభక్తి నేటి తరానికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. సమాజంలో మంచి విలువలను పెంపొందిం చుకుంటూ దేశాభివృద్ధికి యువత భాగస్వాములు కావాలని, అల్లూరి ఆశయాలను ఆచరణలో పెట్టాలని ఎస్పీ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీసీఎస్ డీఎస్పీ పి. జగదీష్ నాయక్, ఏఆర్ డీఎస్పీ కృష్ణంరాజు, ఎస్బీ ఇన్‌స్పెక్టర్లు నారాయణ, రాంబాబు, ఎస్సీ/ఎస్టీ సెల్ ఇన్‌స్పెక్టర్ బాలకోటిరెడ్డి, సోషల్ వెల్ఫేర్ శాఖ ఏడీ శృతి బేతాళ, ఆర్ఐలు మౌలుద్దీన్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

# లింగ నిర్ధారణపై కఠిన చర్యలు



బాపట్ల జులై 4 వార్త సాక్ష్యం

జిల్లాలో గర్భస్థ శిశువు లింగ నిర్ధారణను పూర్తిగా అరికట్టాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వి. వినోద్ కుమార్ వైద్యాధికారులను ఆదేశించారు. శనివారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన జిల్లా స్థాయి పీసీ-పీఎన్‌డీటీ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు.గర్భస్థ శిశువు లింగ నిర్ధారణ, లింగ ఎంపిక ఆధారంగా గర్భస్రావాలను అరికట్టేందుకు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని సూచించారు. పీసీ-పీఎన్‌డీటీ చట్టం-1994 నిబంధనలను అన్ని స్కానింగ్ కేంద్రాలు, జన్యు క్లినిక్‌లు, ప్రయోగశాలలు తప్పనిసరిగా పాటించాలని ఆదేశించారు.నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు డీకాయ్ ఆపరేషన్లు నిర్వహించాలని, స్కానింగ్ కేంద్రాలను క్రమం తప్పకుండా తనిఖీ చేయాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులను ఆదేశించారు. ఆడపిల్లల పట్ల సానుకూల దృక్పథం పెంపొందించేలా విస్తృత అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు.ఈ సమావేశంలో రెండు కొత్త క్లినిక్‌లకు, ఒక క్లినిక్ రెన్యువల్‌కు అనుమతులు మంజూరు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఎస్. విజయమ్మ, వైద్య విధాన పరిషత్ కోఆర్డినేటర్ డాక్టర్ పద్మావతి, డ్రగ్ ఇన్‌స్పెక్టర్ విజయలక్ష్మి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# నకరికల్లు-ఓడరేవు రహదారి పనులు వేగవంతం చేయాలి

పల్నాడు, జులై 4 వార్త సాక్ష్యం



జిల్లాలో నిర్మాణంలో ఉన్న నకరికల్లు-ఓడరేవు జాతీయ రహదారి--167ఏ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కృతిక శుక్లా అధికారులను, కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో జాతీయ రహదారి నిర్మాణ పనులపై సమీక్ష నిర్వహించారు. రోడ్డు విస్తరణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించిన కలెక్టర్, భూసేకరణ చేసిన రైతులకు మిగిలిన పరిహారాన్ని ఆమోదయోగ్యమైన ధరలతో చెల్లించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

VARTHAA SAKSHAMU RNI.Title Code: APTEL/25/A5153 వార్త సాక్ష్యం తెలుగు దిన పత్రిక Editor : SAGINALA RAVI KUMAR



## అంతరించిపోతున్న పర్యావరణాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత మనదే

-అన్మాస్పల్లి ఎర్త్ సెంటర్‌లో రెండు రోజుల శిక్షణ శిబిరం ఘనంగా ముగింపు

-ప్రకృతి సంరక్షణలో విద్యార్థులే భవిష్యత్ నాయకులని పిలుపు

-జస్టిస్ లక్ష్మీనారాయణ అలిశెట్టి




జులై 4 వార్త సాక్ష్యం

డిపార్ట్మెంట్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ మరియు కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్ సంయుక్త ఆధ్వర్యంలో రంగారెడ్డి జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల నుంచి ఎంపికైన యంగ్ ఎర్త్ లీడర్స్‌కు సిజిఆర్ ఫౌండర్ చైర్మన్, అధ్యక్షులు లీలా లక్ష్మారెడ్డి అధ్యక్షతన నిర్వహించిన రెండు రోజుల పర్యావరణ శిక్షణ శిబిరం శనివారం కడ్తల్ మండలం అన్మాస్పల్లి ఎర్త్ సెంటర్‌లో ఘనంగా ముగిసింది. శిబిరం ముగింపు కార్యక్రమంలో ముఖ్య అతిధి గా జస్టిస్ లక్ష్మీనారాయణ అలిశెట్టి పాల్గొని మాట్లాడుతూ అంతరించిపోతున్న పర్యావరణాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత మనదే అని విద్యార్థులకు పర్యావరణ పరిరక్షణలో తమ పాత్ర ఎంతో కీలకమని వివరించారు. శిక్షణలో భాగంగా విద్యార్థులను పలు గ్రూపులుగా విభజించి ప్రకృతి పరిరక్షణకు సంబంధించిన అంశాలపై అవగాహన కల్పించారు. వాటర్ హార్వెస్టింగ్ పిట్ నిర్మాణం, కంపోస్ట్ పిట్ ఏర్పాటు, మెడిసినల్ గార్డెన్ నిర్వహణ, వివిధ రకాల ఔషధ, వృక్ష జాతుల గుర్తింపు, ప్లాస్టిక్ వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలు, ప్లాస్టిక్ నివారణ చర్యలు, సీడ్ బాల్స్ తయారీ, బయో ఎంజైమ్స్ తయారీ విధానాలను నిపుణులు విద్యార్థులకు ప్రత్యక్షంగా చూపిస్తూ వివరించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులు మాట్లాడుతూ, నేటి విద్యార్థులే రేపటి పర్యావరణ పరిరక్షణకు మార్గదర్శకులని పేర్కొన్నారు. ప్రతి పాఠశాలలో పర్యావరణ హిత కార్యక్రమాలను విస్తృతంగా చేపట్టాలని, మొక్కల పెంపకం, నీటి సంరక్షణ, వ్యర్థాల నిర్వహణ, ప్లాస్టిక్ రహిత పరిసరాల ఏర్పాటులో విద్యార్థులుముందుండాలని సూచించారు. శిక్షణ ద్వారా పొందిన విజ్ఞానాన్ని తమ పాఠశాలల్లోని తోటి విద్యార్థులతో పంచుకోవాలని, గ్రామాల్లో కూడా పర్యావరణంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. అనంతరం పాల్గొన్న ప్రతి పుడమి నాయకునికి జస్టిస్ లక్ష్మీనారాయణ అలిశెట్టి చేతుల మీదుగా సర్టిఫికెట్ ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఈఆర్టీ ఉపేందర్ రెడ్డి, దిలీప్ రెడ్డి, వందేమాతరం ఫౌండర్ రవీందర్, వైఈఎల్పీ రాష్ట్ర కో.ఆర్డినేటర్ యనాల వెంకట్ రెడ్డి, పర్యావరణ శాస్త్రవేత్త ఉమామహేశ్వర్ రెడ్డి, వైఈఎల్పీ ఇంచార్జ్ రజనీకాంత్, సీజీఆర్ సభ్యులు నగేష్,శంకరయ్య,హనుమంత్,రవి , ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్యకు ఘన నివాళి

-రోశయ్య సేవలు చిరస్మరణీయం కలెక్టర్ చిత్రా మిశ్రా



జులై 4 వార్త సాక్ష్యం


ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, బహుముఖ ప్రజ్ఞాశాలి, ఆర్థిక వ్యవహారాల్లో అపార అనుభవం కలిగిన స్వర్గీయ కొణిజేటి రోశయ్య జయంతి సందర్భంగా శనివారం కలెక్టరేట్ ఆడిటోరియంలో ఆ మహనీయుడికి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా, అదనపు కలెక్టర్ ,రెవెన్యూ శ్రీనివాస్ రెడ్డి, వివిధ శాఖల అధికారులు ఆర్యవైశ్య సంఘాల ప్రతినిధులు రోశయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన ప్రజాసేవలు, రాజకీయ జీవితం, పరిపాలనా దక్షతను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ కొణిజేటి రోశయ్య నిరాడంబర జీవనశైలితో, నిజాయితీతో ప్రజలకు సేవలు అందించి ఆదర్శంగా నిలిచారని పేర్కొన్నారు. ఆర్థిక మంత్రిగా రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను సమర్థంగా నిర్వహించిన ఆయన, ముఖ్యమంత్రిగా ప్రజా సంక్షేమం, పరిపాలనలో పారదర్శకతకు పెద్దపీట వేశారని గుర్తు చేశారు. రాజకీయాల్లో విలువలు, క్రమశిక్షణ, నిబద్ధతకు ఆయన నిలువెత్తు నిదర్శనమని కొనియాడారు. వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, ఆర్యవైశ్య సంఘాల నాయకులు, ప్రతినిధులు పాల్గొని రోశయ్యకు ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో స్వామి ఆర్డీవోలు షర్మిల, జల కుమారి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి శ్రీరామ్, జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారి అనిల్ ప్రకాష్, డివైఎస్ఓ శ్రీనివాస్ గౌడ్ ఆర్యవైశ్య సంఘాల ప్రతినిధులు కన్న కృష్ణ, మునీందర్ ఆర్యవైశ్య సంఘాల నాయకులు పలువురు అధికారులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## పంట మార్పిడి, ఆయిల్ పామ్ పంటల సాగు ను ప్రోత్సహించాలి

-కాలానుగుణ వ్యాధులు వ్యాపించకుండా తగు చర్యలు తీసుకోవాలి:

-రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు.





జులై 4 వార్త సాక్ష్యం

పంట మార్పిడి విధానాలు,ఆయిల్ పామ్ పంటల సాగు విస్తీర్ణం పెంచేలా రైతులను అధికారులు ప్రోత్సహించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు అధికారులను ఆదేశించారు. సీఎస్ సంజయ్ జాజు శనివారం హైదరాబాదులోని రాష్ట్ర సచివాలయం నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లు అధికారులతో వ్యవసాయ శాఖపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. రాష్ట్రంలో 2026 - 27 సంవత్సరానికి 85 వేల ఎకరాలలో ఆయిల్ పామ్ పంట సాగు చేసేందుకు లక్ష్యంగా నిర్దేశించామన్నారు. దీనికి అనుగుణంగా జిల్లాలలో అధికారులు చొరవ తీసుకోవాలన్నారు. పంట మార్పిడి విధానాలను అవలంబించాలన్నారు. కూరగాయల సాగు వైపు దృష్టి సారించాలని వివరించారు. సూక్ష్మ సేద్య పద్ధతులు రైతులు పాటించేలా వారిని ప్రోత్సహించాలని తెలిపారు. యూరియా, డిఎపి,ఇతర కాంప్లెక్స్ ఎరువులన్నీ రైతులకు సరిపడినన్ని అందించాలన్నారు. ఎరువులను పక్కదారి పట్టిస్తే కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా కలెక్టర్లు స్వయంగా ఈ అంశంపై పటిష్ట నిఘా ఉంచాలని వివరించారు. ఫార్మర్ రిజిస్ట్రీ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. జిల్లాల వారీగా ఫార్మర్ రిజిస్ట్రీ ప్రక్రియను సమీక్షించారు. దేశంలోనే ఫార్మర్ రిజిస్ట్రీలో తెలంగాణ రాష్ట్రం 71.45 శాతం తో మొదటి స్థానంలో ఉందని అన్నారు. వర్షాకాలం కాలానుగుణ వ్యాధులు వ్యాపించే ప్రమాదం ఉందని,అధికారులంతా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. డెంగ్యూ, మలేరియా,టైఫాయిడ్ తదితర వ్యాధులు వ్యాపించకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా కలెక్టరేట్లోని సమావేశం మందిరం నుంచి ఈ వీసీలో కలెక్టర్ భవేశ్ మిశ్రా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో ఆయిల్ పామ్ పంటల సాగు విస్తీర్ణం పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. మండలాల వారిగా లక్ష్యాలను చేరుకునేందుకు ప్రణాళికలను అమలుపరుస్తున్నామని చెప్పారు. రైతుల అవసరాల మేరకు యూరియాను అందిస్తామన్నారు. యూరియా పక్కదారి పట్టకుండా పటిష్ట నిఘా వ్యవస్థ ఏర్పాటు చేశామని తెలిపారు. కాలానుగుణ వ్యాధులు వ్యాప్తి చెందకుండా తగిన చర్యలు తీసుకుంటు న్నామని వివరించారు. స్వయంగా ప్రభుత్వ ఆసుపత్రులను తనిఖీ చేశామని, వైద్య శాఖ అధికారులతో సమావేశాలు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. పారిశుద్ధ్య కార్యక్రమాలను విస్తృతంగా కొనసాగిస్తున్నట్లు తెలిపారు. ఈ వీసీలో అదనపు కలెక్టర్ లు బి. వెంకటేశ్వర్లు,కిషోర్ కుమార్,డిఆర్ఓ రాథోడ్ రమేష్, వ్యవసాయ అధికారి అంజిప్రసాద్, డిపివో శ్రీనివాస్,డిఈఓ భోజన్న, వివిధ శాఖల అధికారులు,సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలి

-ప్రజలకు పారదర్శకంగా ప్రభుత్వ సేవలు

-దిశ సమావేశంలో ఎంపీ గోడం నగేశ్





జులై 4 వార్త సాక్ష్యం

జిల్లాలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంక్షేమ, అభివృద్ధి పథకాల అమలును వేగవంతం చేసి అర్హులైన ప్రతి లబ్ధిదారునికి పారదర్శకంగా ప్రభుత్వ సేవలు అందించాలని ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేశ్ అధికారులను ఆదేశించారు. ప్రజల సమస్యల పరిష్కారంలో అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా సూచించారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఎంపీ గోడం నగేశ్ అధ్యక్షతన నిర్వహించిన జిల్లా అభివృద్ధి సమన్వయ,పర్యవేక్షణ కమిటీ (దిశ) సమావేశంలో జిల్లా కలెక్టర్ రాజర్షి షా, ఐటిడిఏ పీవో మంద మకరందు,ఎమ్మెల్యే పాయల్ శంకర్, మున్సిపల్ చైర్‌పర్సన్ బండారి అనుష, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు. సమావేశంలో గత ఏడాది కాలంగా కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల పథకాల అమలు,వివిధ శాఖల అభివృద్ధి కార్యక్రమాలు,భౌతిక, ఆర్థిక పురోగతి,పెండింగ్ పనులపై శాఖల వారీగా సమగ్ర సమీక్ష నిర్వహించారు. గ్రామీణాభివృద్ధి, ఉపాధి హామీ,పంచాయతీరాజ్, వ్యవసాయం,ఐటిడిఏ, విద్యుత్,వైద్య ఆరోగ్యం, విద్య, మహిళా,శిశు సంక్షేమం, ఉద్యానవనం, అటవీ,గిరిజన సంక్షేమం, క్రీడలు, పౌర సరఫరాలు, బీఎస్ఎన్ఎల్, జాతీయ రహదారులు, లీడ్ బ్యాంక్ తదితర శాఖల పనితీరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ. కేంద్ర నిధులతో అమలవుతున్న అభివృద్ధి కార్యక్రమాల్లో జాప్యానికి తావులేకుండా అధికారులు పనిచేయాలని సూచించారు. గత సమావేశం అనంతరం పనుల్లో పురోగతి కనిపించిందని,ప్రస్తుతం వర్కింగ్ సీజన్ కావడంతో లక్ష్యాల సాధనపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అన్నారు. గ్రామ పంచాయతీల్లో పారిశుద్ధ్యం,ఆరోగ్య సేవలను మెరుగుపరచడంతో పాటు ప్రభుత్వ విద్యాసంస్థల్లో మధ్యాహ్న భోజనం, అల్పాహార కార్యక్రమాలు నాణ్యంగా అమలయ్యేలా చూడాలని సూచించారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి దిశ సమావేశం నిర్వహించి జిల్లాలోని సమస్యలను సమీక్షించి పరిష్కరించాలని తెలిపారు. ప్రతి శాఖ పనితీరును విడివిడిగా సమీక్షించి సమస్యలకు తక్షణ పరిష్కారాలు చూపాలని,అభివృద్ధి పనులను నిర్ణీత గడువులో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఉపాధి హామీ కింద అర్హులైన ప్రతి జాబ్‌కార్డు దారుకు ఉపాధి కల్పించాలని, ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందేలా చర్యలు తీసుకోవాలని, అంగన్‌వాడీ భవనాల నిర్మాణాలను వేగవంతం చేయాలని సూచించారు. అవసరమైన ప్రాంతాల్లో బీఎస్ఎన్ఎల్ సెల్‌టవర్లు,అటవీ ప్రాంతాల్లో సోలార్ విద్యుత్ సౌకర్యాలు కల్పించాలని,రేషన్ బియ్యం పారదర్శకంగా పంపిణీ చేయాలని పేర్కొన్నారు.

-ఉపాధి హామీ పనుల్లో సమాన పనిదినాలు,సమాన వేతనం అమలు చేయాలని ఎమ్మెల్యే పాయల్ శంకర్

ఎమ్మెల్యే పాయల్ శంకర్ మాట్లాడుతూ...ఉపాధి హామీ పనుల్లో సమాన పనిదినాలు,సమాన వేతనం అమలు చేయాలని సూచించారు. యూరియా సరఫరాలో ఇబ్బందులు తలెత్తకుండా చూడడంతో పాటు రైతులకు యూరియా యాప్ వినియోగంపై క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలని చెప్పారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలకు అటవీ అనుమతుల సమస్యలు ఉన్నచోట పరిష్కారం చూపాలని, నిర్మాణాల్లో నాణ్యతకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. జాతీయ రహదారిపై ప్రమాదకర బ్లాక్‌స్పాట్లను గుర్తించి ప్రమాదాల నివారణ చర్యలు చేపట్టాలని కోరారు.

-ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు బాధ్యతగా ఎలా వ్యవహరించాలి జిల్లా కలెక్టర్ రాజర్షి షా

జిల్లా కలెక్టర్ రాజర్షి షా మాట్లాడుతూ...ప్రభుత్వ పథకాలు అర్హులైన ప్రతి లబ్ధిదారునికి పారదర్శకంగా అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. అభివృద్ధి పనులను నిర్ణీత గడువులో పూర్తి చేయడంతో పాటు ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులపై వెంటనే స్పందించి పరిష్కారం చూపాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ రాజేశ్వర్, డీఆర్‌డీవో రాథోడ్ రవీందర్,వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## జిల్లాలో జరుగుతున్న రహదారులు, అభివృద్ధి పనులు వేగవంతంగా పూర్తి చేయాలి

-జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్

-అభివృద్ధి పనుల్లో శాఖల సమన్వయంతో ముందుకు సాగాలి..

-రహదారుల నిర్మాణంలో నాణ్యతతో పాటు గడువుకు ప్రాధాన్యం ఇవ్వాలి..

-జిల్లాలో సీఎం పర్యటన నేపథ్యంలో అన్ని ఏర్పాట్లు సకాలంలో పూర్తి చేయాలి..

-జిల్లాలో ఆర్ & బీ శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన అభివృద్ధి పనుల పురోగతిపై సమీక్షించిన జిల్లా కలెక్టర్..




జులై 4 వార్త సాక్ష్యం

జిల్లాలో వివిధ నియోజకవర్గాల్లో చేపట్టిన రహదారులు, వంతెనలు, భవనాలు తదితర అభివృద్ధి పనులను నాణ్యతతో, నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్ మిటింగ్ హాల్ లో ఆర్‌డబీ శాఖ ఆధ్వర్యంలో జిల్లాలో కొనసాగుతున్న అభివృద్ధి పనుల పురోగతిపై ఇంజినీరింగ్ అధికారులు, సంబంధిత శాఖల అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ, రహదారులు, భవనాల నిర్మాణ పనులకు ఎలాంటి ఆటంకాలు లేకుండా అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేపట్టి పనులను వేగవంతం చేయాలని సూచించారు. పనుల నాణ్యత విషయంలో రాజీ పడకుండా, నిర్దేశిత ప్రమాణాల ప్రకారం నిర్మాణాలు పూర్తి చేయాలని స్పష్టం చేశారు. సీఆర్ఎఫ్ నిధులతో చేపడుతున్న రహదారి నిర్మాణాల్లో ప్రజల ఆస్తులకు ఎలాంటి నష్టం కలగకుండా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని, పనుల అమలులో ఏవైనా సమస్యలు తలెత్తితే వెంటనే తన దృష్టికి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. ఖమ్మం కేబుల్ బ్రిడ్జి ప్రాంతంలో కొనసాగుతున్న రహదారి పనులు, ముదిగొండ--వల్లభి ఫోర్‌లేన్ రహదారి నిర్మాణ పనులు ప్రజలకు ఇబ్బందులు కలగకుండా, నిర్ణీత మెజర్‌మెంట్ ప్రకారం చేపట్టాలని సూచించారు. బోనకల్--ఆలపాడు రహదారి నిర్మాణంలో సంబంధిత తహసీల్దార్‌కు అవసరమైన ప్రతిపాదనలు వెంటనే పంపించి, అనుమతులు వచ్చిన వెంటనే పనులను పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు. ఈ నెలలో ముఖ్యమంత్రి జిల్లాలో పర్యటించే అవకాశం ఉన్నందున సంబంధిత అన్ని అభివృద్ధి పనులు, ఏర్పాట్లను వేగవంతం చేసి సకాలంలో పూర్తి చేసేలా శాఖల మధ్య సమన్వయంతో కార్యాచరణ చేపట్టాలని కలెక్టర్ సూచించారు. సమావేశంలో అధికారులు తమ పరిధిలోని పనుల పురోగతిని వివరించగా, పెండింగ్‌లో ఉన్న అంశాలను త్వరితగతిన పరిష్కరించి అభివృద్ధి పనులను పూర్తి చేయాలని అధికారులను జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ ఆదేశించారు. ఈ సమావేశంలో ఆర్‌డబీ ఎస్ఈ యుగంధర్, ఈఈ బషీర్, సీతారామయ్య, డిఈ భగవాన్, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

VARTHAA SAKSHAMU
వార్త సాక్ష్యం తెలుగు దిన పత్రిక
Editor : SAGINALA RAVI KUMAR
ఆదివారం 5 జూలై 2026

# బిజినెస్

## కొద్దిపాటి మార్పులతో 'క్విడ్'ను రీలాంచ్ చేసిన రెనో... ధర రూ.4.52 లక్షలు!



ప్రముఖ కార్ల తయారీ సంస్థ రెనో, భారత మార్కెట్లో తన విజయవంతమైన మోడల్ క్విడ్ 2026 ఫేస్‌లిఫ్ట్ వెర్షన్‌ను అధికారికంగా విడుదల చేసింది. దీని ప్రారంభ ఎక్స్-షోరూమ్ ధర రూ. 4.52 లక్షలుగా నిర్ణయించింది. ఈసారి కంపెనీ కస్టమర్ల కోసం వేరియంట్ల సంఖ్యను సరళీకరించి, కేవలం ఎవల్యూషన్, క్లైంబర్ అనే రెండు ప్రధాన వేరియంట్లలోనే ఈ కారును అందుబాటులోకి తెచ్చింది. వేరియంట్ల వారీగా ధరలను పరిశీలిస్తే, ఎవల్యూషన్ మాన్యువల్ (ఎంటీ) ధర రూ. 4.52 లక్షలు, ఆటోమేటిక్ (ఏఎంటీ) ధర రూ. 4.89 లక్షలుగా ఉంది. ఇక టాప్ మోడల్ అయిన క్లైంబర్ మాన్యువల్ ధర రూ. 5.14 లక్షలు కాగా, ఏఎంటీ ధర రూ. 5.60 లక్షలుగా ఉంది. ప్రత్యేకంగా క్లైంబర్ వేరియంట్‌ను ఆన్‌లైన్‌లో బుక్ చేసుకునే వారికి కంపెనీ రూ. 15,000 క్యాష్ బెనిఫిట్ అందిస్తోంది. దీంతో దీని ప్రభావవంతమైన ధర రూ. 4.99 లక్షలకు తగ్గుతుంది. ఈ ఫేస్‌లిఫ్ట్ మోడల్‌లో ప్రధానంగా రెనో కొత్త బ్రాండ్ లోగోను పొందుపరిచారు. ఎస్‌యూవీ తరహా డిజైన్‌ను కొనసాగిస్తూనే చిన్నపాటి స్టైలింగ్ మార్పులు చేశారు. క్లైంబర్ వేరియంట్‌లో ప్రత్యేకంగా రగ్డ్ స్టైలింగ్, డ్యూయల్-టోన్ ఇంటీరియర్స్, వీల్ ఆర్చ్ క్లాడింగ్ వంటివి ఆకర్షణీయంగా ఉన్నాయి. ఇంజన్ విషయంలో మాత్రం కంపెనీ ఎలాంటి మార్పులు చేయలేదు. పాత మోడల్‌లో ఉన్న 1.0-లీటర్ 3-సిలిండర్ పెట్రోల్ ఇంజన్‌నే కొనసాగించింది. ఇది 69 బీహెచ్‌పీ శక్తిని, 91 ఎన్ఎమ్ టార్క్‌ను ఉత్పత్తి చేస్తుంది. 5-స్పీడ్ మాన్యువల్, ఏఎంటీ గేర్‌బాక్స్ ఆప్షన్లతో ఇది లభిస్తుంది.

## టాప్ 5 ఐటీ దిగ్గజాలకు సమానంగా.. ఒక్క రిలయన్స్ మార్కెట్ విలువ!

భారత కార్పొరేట్ రంగంలో సమీకరణాలు వేగంగా మారుతున్నాయి. ముఖేశ్ అంబానీ నేతృత్వంలోని రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ (ఆర్ఐఎల్) మార్కెట్ విలువ, దేశంలోని ఐదు అగ్రశ్రేణి ఐటీ కంపెనీల ఉమ్మడి మార్కెట్ విలువకు దాదాపు సమానంగా చేరింది. ఐటీ రంగం తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంటున్న తరుణంలో, రిలయన్స్ ఈ అరుదైన మైలురాయిని చేరుకోవడం గమనార్హం. శుక్రవారం ట్రేడింగ్ ముగిసే సమయానికి రిలయన్స్ మార్కెట్ క్యాపిటలైజేషన్ సుమారు రూ.18 లక్షల కోట్లుగా నమోదైంది. అదే సమయంలో, దేశంలోని టాప్-5 ఐటీ దిగ్గజాలైన టీసీఎస్, ఇన్ఫోసిస్, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, విప్రో, టెక్ మహీంద్రాల ఉమ్మడి మార్కెట్ విలువ రూ.18.12 లక్షల కోట్లుగా ఉంది. కొన్నేళ్ల క్రితం వరకు టీసీఎస్ ఒక్కటే రిలయన్స్ కంటే ఎక్కువ మార్కెట్ విలువను కలిగి ఉండేది, కానీ ప్రస్తుతం పరిస్థితులు పూర్తిగా మారిపోయాయి. 2026లో ఐటీ స్టాక్స్ తీవ్రమైన ఒత్తిడిని ఎదుర్కొంటున్నాయి. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) వల్ల సంప్రదాయ ఐటీ సేవలకు ముప్పు వాటిల్లుతుందన్న ఆందోళనలు, అంతర్జాతీయంగా టెక్నాలజీ వ్యయం తగ్గడం, ఆర్థిక అనిశ్చితి వంటి కారణాలతో ఈ కంపెనీల షేర్లు ఈ ఏడాదిలో ఇప్పటివరకు 36 శాతం వరకు పతనమయ్యాయి. అయితే, రిలయన్స్ ఇండస్ట్రీస్ కూడా ఈ ఒడిదొడుకులకు అతీతంగా ఏమీ లేదు. అంతర్జాతీయ ఇంధన మార్కెట్‌లోని మార్పులు, ముఖ్యంగా ఇరాన్-అమెరికా ఉద్రిక్తతల ప్రభావంతో ఈ ఏడాది రిలయన్స్ షేరు విలువ సుమారు 17 శాతం మేర క్షీణించింది. గత నెలలో 52 వారాల కనిష్ఠ స్థాయి రూ.1,253.20కి పడిపోయిన షేరు ధర, ప్రస్తుతం రూ.1,304 వద్ద ట్రేడ్ అవుతోంది. మరోవైపు, రిలయన్స్ తన వ్యాపార వైవిధ్యీకరణను మరింత వేగవంతం చేస్తోంది. ఇటీవలి వార్షిక సర్వసభ్య సమావేశంలో ప్రకటించినట్లుగా, అప్పుల చెల్లింపుల కోసం రూ.35,000-40,000 కోట్ల భారీ లక్ష్యంతో జియో ప్లాట్‌ఫామ్స్ ఐపీవోకు రంగం సిద్ధం చేస్తోంది.

## భారత ఈ20 పెట్రోల్‌కు భూటాన్ నో.. కారణం ఇదే!




ఇంధనంలో ఇథనాల్ వినియోగాన్ని పెంచేందుకు భారత్ వేగంగా అడుగులు వేస్తున్న వేళ.. పొరుగుదేశం భూటాన్ మాత్రం ఈ20 పెట్రోల్‌ను తిరస్కరించింది. సాధారణ పెట్రోల్‌నే సరఫరా చేయాలని భారత చమురు మార్కెటింగ్ సంస్థలను కోరింది. ఇందుకు భూటాన్ పేర్కొన్న కారణాలు ఇప్పుడు ఆసక్తికరంగా మారాయి. భూటాన్‌లోని పాత భూగర్భ ఇంధన నిల్వ ట్యాంకులు ఈ20 పెట్రోల్‌కు అనుకూలంగా లేవని అక్కడి ప్రభుత్వం తెలిపింది. ఇథనాల్ తేమను సులభంగా పీల్చుకునే గుణం కలిగి ఉండటంతో ట్యాంకుల్లోకి నీరు చేరితే ఇంధనం కలుషితమయ్యే ప్రమాదం ఉందని వివరించింది. దీంతో వాహనాల పనితీరుపై ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉందని పేర్కొంది. అంతేకాదు.. భూటాన్‌లో ఎక్కువ ప్రాంతాలు కొండలు, ఎత్తైన రహదారులతో ఉంటాయి. అలాంటి ప్రాంతాల్లో వాహనాలకు పూర్తి శక్తి అవసరమవుతుందని, ఈ20 పెట్రోల్ అదే స్థాయి పనితీరును అందిస్తుందో లేదో అన్న సందేహం కూడా అధికారుల్లో ఉందని స్థానిక మీడియా వెల్లడించింది. భూటాన్ మరో విజ్ఞప్తి కూడా చేసింది. భవిష్యత్తులో భారత్ ఈ25 లేదా పూర్తిగా ఇథనాల్ ఆధారిత ఇంధనానికి మారితే ముందుగానే సమాచారం ఇవ్వాలని కోరింది భూటాన్ తనకు అవసరమైన మొత్తం పెట్రోల్, డీజిల్‌ను భారత్ నుంచే దిగుమతి చేసుకుంటోంది. ప్రస్తుతం భారతీయ పెట్రోల్ బంకుల్లో లభించే ఇంధనం కాకుండా, ఎగుమతుల కోసం ఉత్పత్తి చేసే నాణ్యమైన ఇంధనాన్ని కొనుగోలు చేస్తోంది. భారత్‌లో ఈ20 పెట్రోల్‌పై ఇప్పటికే చర్చ కొనసాగుతోంది. 2023కు ముందు తయారైన కొన్ని పెట్రోల్ వాహనాల యజమానులు మైలేజీ తగ్గడం, నిర్వహణ ఖర్చులు పెరగడం వంటి సమస్యలను ప్రస్తావిస్తున్నారు. అయితే ప్రభుత్వం మాత్రం మైలేజీ కొంత తగ్గినా ఇంజిన్ పనితీరు, యాక్సిలరేషన్ మెరుగుపడతాయని చెబుతోంది.

## వింబుల్డన్ 2026: ఫెదరర్ రికార్డును సమం చేసిన జకోవిచ్

ఇంటర్నెట్ డెస్క్:

టెన్నిస్ దిగ్గజం నొవాక్ జకోవిచ్ వింబుల్డన్‌లో మరో చారిత్రక ఘనత సాధించాడు. ఫ్రాన్స్‌కు చెందిన ఆర్థర్ రిండర్‌క్నెక్‌పై మూడో రౌండ్‌లో 7-5, 6-4, 1-6, 7-6తో విజయం సాధించాడు. అయితే జకోవిచ్‌కు వింబుల్డన్ టోర్నీలో ఇది 105వ సింగిల్స్ మ్యాచ్ విజయం కావడం విశేషం. ఈ క్రమంలో పురుషుల విభాగంలో అత్యధిక విజయాలు సాధించిన రోజర్ ఫెదరర్ రికార్డును జకోవిచ్ సమం చేశాడు. మహిళల విభాగంలో మార్టినా నవ్రతిలోవా 120 సింగిల్స్ విజయాలతో అగ్రస్థానంలో కొనసాగుతోంది. ఫ్రాన్స్‌పై విజయంతో జకోవిచ్ నాలుగో రౌండ్‌కు అర్హత సాధించాడు. కాగా వింబుల్డన్‌లో 7 టైటిళ్లు సాధించిన జకోవిచ్.. ఫెదరర్ ఎనిమిది టైటిళ్ల రికార్డును కూడా సమం చేయాలన్న లక్ష్యంతో ముందుకు సాగుతున్నాడు. కాగా ఫెదరర్ రికార్డు గురించి మ్యాచ్ అనంతరం జకోవిచ్ మాట్లాడాడు. '105 విజయాలతో ఫెదరర్ రికార్డును సమం చేయడం గొప్ప గౌరవంగా భావిస్తున్నా. అయితే 106వ విజయం కోసం మా ఇద్దరి మధ్య మ్యాచ్ నిర్వహించాలని వింబుల్డన్ నిర్వాహకులను కోరుతున్నా' అంటూ జకోవిచ్ సరదాగా వ్యాఖ్యాని ంచాడు. నాలుగో రౌండ్‌లో జకోవిచ్.. రష్యా క్వాలిఫయర్ రోమన్ సఫియులిన్‌తో తలపడ నున్నాడు. మరోవైపు డిఫెండింగ్ ఛాంపియన్



యానిక్ సినర్ 6-4, 6-3, 6-4తో జన్సన్ బ్రూక్స్‌బైను ఓడించి ప్రిక్వార్టర్స్‌కు చేరుకున్నాడు. తదుపరి మ్యాచ్‌లో జపాన్ క్వాలిఫయర్ షింటారో మొచిజుకిని ఎదుర్కొంటాడు.

-మహిళల విభాగంలో..

మహిళల సింగిల్స్‌లో ప్రపంచ నంబర్-1 అరినా సబలెంకా.. జెలెనా ఒస్టాపెంకోపై 6-4, 6-4తో విజయం సాధించింది. మరోవైపు నాలుగు గ్రాండ్ స్లామ్‌ల విజేత నవోమి ఒసాకా 6-1, 6-3తో డారియా కసత్కినాను ఓడించి కెరీర్‌లో తొలిసారి వింబుల్డన్ నాలుగో రౌండ్‌కు చేరుకుంది. తదుపరి రౌండ్‌లో సబలెంకా-ఒసాకా మధ్య హోరాహోరీ పోరు జరగనుంది. అమెరికా స్టార్ కోకో గాఫ్ కూడా మూడో రౌండ్‌లో క్లేర్ లియూను 6-3, 6-7 (5), 6-2తో ఓడించి నాలుగో రౌండ్‌కు అర్హత సాధించింది. అలాగే జెసికా పెగులా, కరోలినా ముచోవా, గత ఏడాది ఛాంపియన్ బార్బోరా క్రెజికోవా కూడా తదుపరి దశకు చేరుకున్నారు.

## పోరాడాం.. గెలిచాం.. కాబో వెర్డ్‌పై విజయం తర్వాత మెస్సి భావోద్వేగ పోస్ట్

ఇంటర్నెట్ డెస్క్:

ఫిఫా ప్రపంచ కప్‌లో అరంగేట్ర జట్టు కాబో వెర్డ్‌పై జరిగిన ఉత్కంఠభరిత పోరులో అర్జెంటీనా 3-2 తేడాతో పోరాడి గెలిచింది. దీంతో రౌండ్ 16కు అర్హత సాధించింది. పసికూన కాబో వెర్డ్ అద్భుత ఆటతీరుకు ఫుట్‌బాల్ ప్రపంచం ఆశ్చర్యపోయింది. డిఫెండింగ్ ఛాంపియన్ అర్జెంటీనాకు ముచ్చెమటలు పట్టించింది. అయితే ఆఖరిలో అద్భుతంగా పుంజుకున్న అర్జెంటీనా.. కాబో వెర్డ్ పై విజయం సాధించింది. ఈ మ్యాచ్ అనంతరం ఫుట్‌బాల్ స్టార్ ప్లేయర్, అర్జెంటీనా కెప్టెన్ లియోనెల్ మెస్సి సోషల్ మీడియా వేదికగా భావోద్వేగంగా పోస్ట్ పెట్టాడు. ఈ మ్యాచ్ కష్టంగా ఉంటుందని అంచనా వేశాం. ఆ ఒత్తిడిని భరించి చివరికి విజయాన్ని సాధించాం. కాబో వెర్డ్‌పై పోరాడాం.. బాధను భరించాం.. చివరికి గెలిచాం. అయితే ఈ టోర్నీలో ఇంకా మా ప్రయాణం కొనసాగుతోంది' అంటూ మెస్సి తన ఇన్‌స్టా ఖాతాలో పోస్ట్ చేశాడు. కాగా చివరి వరకూ అద్భుతంగా పోరాడిన కాబో వెర్డ్‌పై మెస్సి ప్రశంసల జల్లు కురిపించాడు. 'ప్రపంచ కప్‌లో ఏదీ తేలిగ్గా రాదు. కాబో వెర్డ్ ఈ టోర్నీలో అద్భుతంగా ఆడింది.





ఇప్పుడు మాకు కాస్త విరామం దొరికింది. ఈ మ్యాచ్ నుంచి చాలా విషయాలు నేర్చుకున్నాం. తదుపరి పోరుపై దృష్టి పెడతాం' అని మెస్సి తెలిపాడు. కాగా ప్రిక్వార్టర్స్‌లో అర్జెంటీనా.. ఈజిప్ట్‌తో తలపడనుంది.

# స్పోర్ట్స్

## ఇంగ్లండ్‌తో రెండో టీ20: వైభవ్ సూర్యవంశీ అరంగేట్రం.. సచిన్ రికార్డ్ బ్రేక్




ఇంటర్నెట్ డెస్క్:

ఎప్పుడా.. ఎప్పుడా.. అని ఎదురుచూస్తోన్న క్షణం రానే వచ్చింది. యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ ఇంగ్లండ్‌తో రెండో టీ20లో అరంగేట్రం చేయనున్నాడు. భారత వైస్ కెప్టెన్ తిలక్ వర్మ నుంచి క్యాప్ అందుకున్నాడు. దీంతో 15 ఏళ్ల వయసులోనే అంతర్జాతీయ అరంగేట్రం చేసిన తొలి ప్లేయర్‌గా వైభవ్ చరిత్ర సృష్టించాడు. ఈ క్రమంలో క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ రికార్డును బ్రేక్ చేశాడు. సచిన్ 16 ఏళ్ల వయసులో ఇంటర్నేషనల్ డెబ్యూ చేయగా.. వైభవ్ 15 సంవత్సరాల 99 రోజులకే అంతర్జాతీయ క్రికెట్‌లో అడుగుపెట్టాడు. మాంచెస్టర్ వేదికగా జరుగనున్న రెండో టీ20లో టీమిండియా టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకుంది. దీంతో ఇంగ్లండ్ తొలుత ఫీల్డింగ్ చేయనుంది. కాగా వరుస మ్యాచుల్లో విఫలమైన సంజు శాంసన్‌పై వేటు పడింది. అతడి స్థానంలోనే వైభవ్ సూర్యవంశీ ఆడనున్నాడు.

-భారత తుది జట్టు:

శ్రేయస్ అయ్యర్(కెప్టెన్), వైభవ్ సూర్యవంశీ, అభిషేక్ శర్మ, ఇషాన్ కిషన్(వికెట్ కీపర్), తిలక్ వర్మ, శివం దూబె, హర్షిత్ రాణా, అక్షర్ పటేల్, రవి బిష్ణోయ్, అర్ష్‌దీప్ సింగ్, వరుణ్ చక్రవర్తి

-ఇంగ్లండ్ తుది జట్టు:

హ్యారీ బ్రూక్(కెప్టెన్), ఫిల్ సాల్ట్, జోస్ బట్లర్(వికెట్ కీపర్), జాకబ్ బెథెల్, టామ్ బాంటన్, శామ్ కరన్, విల్ జాక్స్, లియామ్ డాసన్, ఆదిల్ రషీద్, జోఫ్రా ఆర్చర్, టంగ్

# తల్లి కావడానికి ముందు సమంత మరో కీలక ప్రకటన!



-తల్లి కాబోతున్న హీరోయిన్ సమంత

-ఈ తరుణంలో స్టార్ హీరోయిన్ నుంచి మరో కీలక ప్రకటన

-సోనీ లివ్ తమిళ్‌తో కొత్త ప్రాజెక్ట్

-నిర్మాతగానా? నటిగానా? అనేది క్లారిటీ ఇవ్వని నటి

-త్వరలో ప్రకటిస్తానని వెల్లడి

స్టార్ హీరోయిన్ సమంత వ్యక్తిగత జీవితంలో తల్లి కావడానికి సిద్ధమవుతూనే.. కెరీర్‌లో మరో కీలక అడుగు వేసింది. ఇటీవల తన ప్రెగ్నెన్సీని ప్రకటించిన ఆమె.. ప్రముఖ ఓటీటీ వేదిక సోనీ లివ్‌తో కొత్త భాగస్వామ్యాన్ని ప్రారంభించింది. సోనీ లివ్ తమిళ్‌తో కలిసి ఓ కొత్త ప్రాజెక్ట్‌ను సమంత ప్రకటించింది. అయితే ఇందులో ఆమె నటిస్తారా? నిర్మాతగా వ్యవహరిస్తారా? అనే విషయాలపై ఇంకా అధికారిక ప్రకటన రాలేదు. సినీ వర్గాల సమాచారం ప్రకారం రెండు బాధ్యతలూ ఆమె చేపట్టే అవకాశం ఉంది. ఈ సందర్భంగా సమంత మాట్లాడుతూ.. "ఈ ఏడాది మార్పులను స్వీకరించడం, కొత్త ఆరంభాలను ఆహ్వానించడం నేర్పింది. సోనీ లివ్ తమిళ్‌తో ఈ కొత్త అధ్యాయాన్ని ప్రారంభించడం చాలా సంతోషంగా ఉంది. ఎంతో ఆసక్తికరమైన ప్రాజెక్ట్‌పై పనిచేస్తున్నాం. త్వరలోనే అందరితో పంచుకుంటాను" అని వెల్లడించింది. ఇక వ్యక్తిగత జీవితంలో సమంత, దర్శకుడు రాజ్ నిడిమోరు తమ తొలి బిడ్డకు స్వాగతం పలకనున్నారు. ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన 'మా ఇంటి బంగారం' సినిమా థ్యాంక్స్ మీట్‌లో ఆమె తాను గర్భవతిని అని అధికారికంగా ప్రకటించింది. "కొంతకాలం విరామం తీసుకోవాల్సి ఉంటుంది. ఇప్పుడు మెటర్నిటీ లీవ్‌లోకి వెళ్తున్నాను. చాలా ఆనందంగా ఉంది. చిన్న గ్యాప్ తర్వాత మళ్లీ వస్తాను" అని సమంత తెలిపారు. ఇటీవల సోషల్ మీడియాలో బేబీ బంప్‌తో దిగిన ఫొటోను పంచుకున్న ఆమె.. "నా సిక్స్‌ప్యాక్... మళ్లీ కలుద్దాం" అంటూ సరదాగా క్యాప్షన్ ఇచ్చారు.

## లోకేశ్ కనగరాజ్ సినిమాలో ఛాన్స్ కొట్టేసిన రెజీనా!



కోలీవుడ్‌లో హిట్ డైరెక్టర్‌గా గుర్తింపు సాధించిన లోకేశ్ కనగరాజ్ ఇప్పుడు నిర్మాతగా మరో కొత్త ఇన్నింగ్స్ ప్రారంభించబోతున్నారు. 'ఖైదీ', 'విక్రమ్', 'కూలీ', 'లియో' వంటి బ్లాక్‌బస్టర్ చిత్రాలతో దర్శకుడిగా సత్తా చాటిన లోకేశ్... హీరోగా 'డీసీ' సినిమాతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్న సంగతి తెలిసిందే. అయితే, ఇప్పుడు ఆయన నిర్మాతగా ఓ లేడీ ఓరియెంటెడ్ చిత్రానికి సన్నాహాలు చేస్తున్నట్టు తెలుస్తోంది. విశాల్ వెంకట్ దర్శకత్వం వహించనున్న ఈ చిత్రంలో రెజీనా కసాండ్రా ప్రధాన పాత్రలో నటించబోతోందట. స్క్రిప్ట్ వర్క్ ఇప్పటికే పూర్తయిందని, సినిమా షూటింగ్ కూడా త్వరలోనే ప్రారంభమయ్యే అవకాశం ఉందని, అధికారిక ప్రకటన త్వరలో వెలువడనుందని చెబుతున్నారు. లోకేశ్ కనగరాజ్ 'డీసీ' సినిమా ప్రమోషన్స్‌లో బిజీగా ఉన్నప్పటికీ, తన తదుపరి ప్రాజెక్టులపై కూడా ఫోకస్ పెట్టినట్లు తెలుస్తోంది. డైరెక్టర్‌గా, హీరోగా మాత్రమే కాకుండా నిర్మాతగా కూడా సినిమా ఇండస్ట్రీలో తన ముద్ర వేసేందుకు ఆయన సిద్ధమవుతున్నారు. ఈ లేడీ ఓరియెంటెడ్ చిత్రం ద్వారా రెజీనా కసాండ్రా మరో మంచి అవకాశం కొట్టేసిందని సినీ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

## ఇన్‌స్టాగ్రామ్ ఎంట్రీ ఇస్తున్న నందమూరి హీరో.. రేపు తొలి పోస్టు!



నందమూరి హీరో కల్యాణ్ రామ్ సోషల్ మీడియాలోకి అడుగుపెట్టనున్నారు. ఇప్పటివరకు ఇన్‌స్టాగ్రామ్‌కు దూరంగా ఉన్న ఆయన, తన పుట్టినరోజు సందర్భంగా జులై 5న అధికారికంగా ఈ ప్లాట్‌ఫామ్‌లో చేరనున్నారు. ఈ విషయాన్ని ఆయన బృందం అధికారికంగా ప్రకటించింది. రేపు (ఆదివారం) ఉదయం 10:11 గంటలకు ఒక ప్రత్యేక పోస్ట్‌తో ఆయన ఇన్‌స్టా ప్రయాణం మొదలవుతుంది. అభిమానులతో మరింత దగ్గరగా మమేకమయ్యేందుకు, తన వ్యక్తిగత, వృత్తిపరమైన విషయాలను పంచుకునేందుకు కల్యాణ్ రామ్ ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. సినిమా అప్‌డేట్స్, షూటింగ్ విశేషాలు, తెర వెనుక సంగతులను ఇకపై తన ఇన్‌స్టా ఖాతా ద్వారా పంచుకోనున్నారు. ఈ వార్తతో నందమూరి అభిమానులు సోషల్ మీడియాలో సందడి చేస్తున్నారు. తమ అభిమాన హీరోకు ఇన్‌స్టాగ్రామ్‌లోకి ఘన స్వాగతం పలికేందుకు సిద్ధమవుతున్నారు. ప్రస్తుతం కల్యాణ్ రామ్ కెరీర్ పరంగా ఫుల్ బిజీగా ఉన్నారు. విక్టరీ వెంకటేశ్ తో కలిసి ఓ భారీ మల్టీస్టారర్ చిత్రంలో నటిస్తున్నారు. స్టార్ డైరెక్టర్ అనిల్ రావిపూడి దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాలో కీర్తి సురేశ్, కృతి శెట్టి హీరోయిన్లుగా నటిస్తున్నారు. షైన్ స్క్రీన్స్, సురేశ్ ప్రొడక్షన్స్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని 2027 సంక్రాంతికి విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

# థియేటర్లలో రికార్డులు.. ఇక ఓటీటీలో 'పెద్ది' హంగామా.. స్ట్రీమింగ్ ఎప్పుడంటే..!


-ఓటీటీలోకి రాబోతున్న రామ్ చరణ్ 'పెద్ది'

-జులై 9 నుంచి నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమింగ్

-ఈ ఏడాది టాలీవుడ్‌లో హయ్యస్ట్ గ్రాసర్‌గా నిలిచిన చిత్రం

-ప్రపంచవ్యాప్తంగా రూ. 400 కోట్లకు పైగా వసూళ్లు

మెగా పవర్‌స్టార్ రామ్ చరణ్ నటించిన 'పెద్ది' చిత్రం ఇప్పుడు ఓటీటీ విడుదలకు సిద్ధమైంది. థియేటర్లలో భారీ విజయం సాధించిన ఈ సినిమా, ప్రముఖ ఓటీటీ ప్లాట్‌ఫామ్ నెట్‌ఫ్లిక్స్‌లో జులై 9 నుంచి స్ట్రీమింగ్ కానుంది. ఈ మేరకు అధికారిక ప్రకటన వెలువడింది. తెలుగుతో పాటు తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో ఈ సినిమాను జులై 9న విడుదల చేయనున్నారు. అయితే, హిందీ వెర్షన్ మాత్రం ఆగస్టులో అందుబాటులోకి రానుంది. దక్షిణాది భాషలకు ఐదు వారాల థియేట్రికల్ విండో తర్వాత ఈ చిత్రాన్ని ఓటీటీలో రిలీజ్ చేస్తున్నారు. బుచ్చిబాబు సానా దర్శకత్వం వహించిన ఈ స్పోర్ట్స్ యాక్షన్ డ్రామా ఈ ఏడాది టాలీవుడ్‌లో అత్యధిక వసూళ్లు సాధించిన చిత్రంగా రికార్డు సృష్టించింది. ప్రపంచవ్యాప్తంగా రూ. 400 కోట్లకు పైగా గ్రాస్ వసూలు చేసింది. తెలుగు రాష్ట్రాల్లో అద్భుతమైన ప్రదర్శన కనబరిచినప్పటికీ, అంతర్జాతీయ మార్కెట్లలో ఆశించిన స్థాయిలో రాణించలేకపోయింది. ఈ చిత్రంలో జాన్వీ కపూర్ కథానాయికగా నటించగా, శ్రుతి హాసన్ ఓ ప్రత్యేక గీతంలో అలరించారు. శివ రాజ్‌కుమార్, దివ్యేందు, బోమన్ ఇరానీ, జగపతి బాబు, తారక్ పొన్నప్ప తదితరులు కీలక పాత్రలు పోషించారు. ఏఆర్ రెహమాన్ ఈ చిత్రానికి సంగీతం అందించారు.




# యూట్యూబ్ లో 'కన్నప్ప'- ఫ్రీగా చూడొచ్చు!

-యూట్యూబ్‌లో ఉచితంగా అందుబాటులోకి వచ్చిన 'కన్నప్ప' చిత్రం

-వీకెండ్ కానుకగా సినిమాను స్ట్రీమింగ్‌కు పెట్టిన నటుడు విష్ణు మంచు

-గతేడాది విడుదలై మంచి ఆదరణ పొందిన భక్తిరస చిత్రం

-ప్రభాస్, మోహన్‌లాల్, అక్షయ్ కుమార్ వంటి భారీ తారాగణం

నటుడు, నిర్మాత మంచు విష్ణు తన ప్రతిష్టాత్మక చిత్రం 'కన్నప్ప'ను ప్రేక్షకులకు మరింత చేరువ చేసేందుకు కీలక నిర్ణయం తీసుకున్నారు. ఈ భక్తిరస చిత్రాన్ని యూట్యూబ్ వేదికగా పూర్తి నిడివితో ఉచితంగా అందుబాటులోకి తీసుకువచ్చారు. వారాంతంలో కుటుంబ సభ్యులు, భక్తులు ఎటువంటి వ్యయం లేకుండా ఈ చిత్రాన్ని వీక్షించేందుకు వీలుగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. శివభక్తుడైన కన్నప్ప జీవన గాథ ఆధారంగా రూపొందిన ఈ చిత్రానికి ముఖేష్ కుమార్ సింగ్ దర్శకత్వం వహించారు. 24 ఫ్రేమ్స్ ఫ్యాక్టరీ, ఏవీఏ ఎంటర్‌టైన్‌మెంట్ పతాకాలపై డాక్టర్ మోహన్ బాబు ఈ చిత్రాన్ని నిర్మించారు. ఇందులో విష్ణు మంచు టైటిల్ రోల్ పోషించగా.. మోహన్ బాబు, ప్రభాస్, మోహన్‌లాల్, అక్షయ్ కుమార్, కాజల్ అగర్వాల్, బ్రహ్మానందం వంటి భారీ తారాగణం కీలక పాత్రల్లో నటించారు. గతేడాది జూన్ 2025లో థియేటర్లలో విడుదలైన ఈ చిత్రం తెలుగు రాష్ట్రాల్లో విశేష ప్రేక్షకాదరణ పొందింది. సినిమా విడుదలై ఏడాది పూర్తయిన సందర్భంగా జూన్ 27, 2026న పరిమిత సంఖ్యలో కొన్ని థియేటర్లలో ఈ చిత్రాన్ని పునఃప్రదర్శించారు. తాజాగా, జూలై 3 నుండి ఏవీఏ ఎంటర్‌టైన్‌మెంట్ అధికారిక యూట్యూబ్ ఛానల్‌లో ఈ పూర్తి చిత్రం స్ట్రీమింగ్ అవుతోంది. తెలుగుతో పాటు ఇతర దక్షిణాది భాషల్లోనూ దీనిని అందుబాటులో ఉంచారు. డిజిటల్ ప్లాట్‌ఫామ్‌ల ద్వారా ఇటువంటి పౌరాణిక, భక్తి చిత్రాలను అత్యధిక మంది ప్రేక్షకులకు చేరువ చేయాలనే ఉద్దేశంతోనే చిత్ర బృందం ఈ నిర్ణయం తీసుకున్నట్లు విశ్లేషకులు భావిస్తున్నారు



PRINTED ,PUBLISHED ,OWNED BY VARTHAA SAKSHAMU NEWS .Regd no:APTEL/25/A5153, EDITOR :S.RAVI KUMAR, 32-3-1, SPG PALEM, ATMAKURU, KURNOOL ANDHRAPRADESH,-518422.